# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :211 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 29-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## రష్యా చమురు విషయంలో అమెరికా ద్వంద్వ వైఖరి

కౌలాలంపూర్, రష్యా చమురు విషయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తప్పుబట్టారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కో దేశం పట్ల ఒక్కో విధంగా వ్యవహరిస్తుండడాన్ని తప్పుబట్టారు. 'సెలక్టివ్'గా నిబంధనలు వర్తింపజేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. నీతులు చెప్పేవారు ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారంటూ ఆసియాన్ సదస్సులో ఆయన వ్యాఖ్యలు చేశారు. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ సర్కారు 25 శాతం సుంకం విధిస్తున్న సంగతి తెలిసిందే. చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆసియాన్ సదస్సులో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో భేటీ అనంతరం జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ వైపు సరఫరా గొలుసులు క్షీణిస్తున్నాయని, మరోవైపు ఇంధన మార్కెట్లు కుచించుకుపోతున్నాయని జైశంకర్ అన్నారు. మరోవైపు టెక్నాలజీ, సహజ వనరుల కోసం పోటీ వంటి కఠిన సమయాన్ని ప్రపంచం చూస్తోందని పేర్కొన్నారు.

## తీరప్రాంత జిల్లాల్లో విస్తారంగా వర్షాలు



కాకినాడ,అక్టోబర్28: మొంథా తుపాను ప్రభావంతో ఏపీవ్యాప్తంగా తీరప్రాంత జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆయా జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతల ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు మండలాల్లో ఈదురు గాలులు వీస్తున్నాయి. సాయంత్రం నుంచి గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేశ్ కుమార్ తెలిపారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో కెరటాల ఉధృతి మరింత పెరిగింది. ఈ ప్రభావంతో ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్ రోడ్డు ధ్వంసమైంది. తుపాను ప్రభావంతో విశాఖ జిల్లాలో రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. పలు చోట్ల చెట్లు నేలకూలాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహిస్తోంది. ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారిపై నీటమునిగిన సర్వీసు రోడ్డు బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై కాజ్‌వేపై నుంచి పారుతున్న నీరు విశాఖపట్నంలోని 13వ వార్డులో చెట్టు కూలింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, కాకుమాను, ప్రత్తిపాడు, పెదినందిపాడు, తాడికొండ, తుళ్లూరు, మేడికొండూరు మండలాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 72 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. జీఎంసీ పరిధిలోని మూడు నియోజకవర్గాలను ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో అధికార, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నిజాంపట్నం హార్బర్‌లో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లద్దని అధికారులు హెచ్చరించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తు న్నాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, గురజాల సహా పలు చోట్ల వానలు పడుతున్నాయి. తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా రాత్రి నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. తీరప్రాంత గ్రామాలు, పర్యాటక ప్రాంతాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు.నెల్లూరు జిల్లాలో

## సీఎం, మంత్రుల మధ్య టగ్ ఆఫ్ వార్ నడిచిందా?

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాలు రంజు మీదున్నాయ్. అధికార, ప్రతిపక్షాలు ఏ మాత్రం తగ్గడం లేదు. సమయం దొరికిన ప్రతీసారి కాంగ్రెస్‌ను కార్నర్ చేయడంలో బీఆర్ఎస్ ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. ఈ క్రమంలోనే క్యాబినెట్ భేటీ చుట్టూ తెలంగాణ రాజకీయం హీటెక్కుతోంది. క్యాబినెట్‌లో పర్సనల్ పంచాయితీలు జరిగాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. మంత్రులు గ్రూపులుగా విడిపోయి తిట్టకున్నారని..హరీశ్ రావు అలిగేషన్స్ చేశారు.అంతేకాదు రాష్ట్ర క్యాబినెట్ దండుపాళ్యం బ్యాచ్‌గా మారిపోయిందని సీరియస్ కామెంట్సే చేశారు హరీశ్‌రావు. అయితే క్యాబినెట్ మీటింగ్‌లో పర్సనల్ విషయాలు చర్చకు రాలేదంటున్న మంత్రులు..కావాలనే తమను బద్నాం చేస్తున్నారని హరీశ్ రావుపై మంత్రి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ ఫైర్ అయ్యారు. చేసిన ఆరోపణలపై ప్రమాణానికి రావాలని హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి సవాల్ విసిరారు.ఇక హరీశ్ రావుకు మద్దతుగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వాయిస్ రేజ్ చేశారు. చర్చకు సిద్ధమంతూ ట్యాంక్ బండ్ దగ్గరున్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం దగ్గరకు వెళ్లారు బీఆర్ఎస్ నేతలు. హరీశ్‌రావు గద్ద మీదకు వెళ్లి తాను సవాల్ విసిరానని..అయితే ఆయన మొహం చాటేసుకుని వెళ్లిపోయారని అడ్లూరి రివర్స్ అటాక్ చేస్తున్నారు.పోటాపోటీ సవాళ్లు, ప్రతిసవాళ్లతో అందరి దృష్టి క్యాబినెట్ భేటీపై పడింది. ఇంతకు ఈ నెల 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఏం జరిగిందనే చర్చకు తెరమీదకు వచ్చింది. ఆ క్యాబినెట్ భేటీ జరగడానికి ముందు మంత్రి జూపల్లి, ఐఏఎస్ రిజ్వీ వివాదం..అంతకు ముందు కొండా సురేఖ, పొంగులేటి ఎపిసోడ్ రచ్చరంబోలా అయింది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్ భేటీలో ఫుల్ సీరియస్ అయ్యారని..మంత్రులను లెఫ్ట్ అండ్ రైట్ తీసుకున్నారని అంటున్నారు.అంతేకాదు అమాత్యులు కూడా ఎక్కడా తగ్గలేదని..మంత్రులు జూపల్లి, పొన్నం, కొండా సురేఖ కూడా సీరియస్‌గానే రియాక్ట్ అయ్యారన్న టాక్ వినిపిస్తోంది. మీరు వాటాల కోసం కొట్లాడుకుంటే మళ్లీ గెలవమని రేవంత్ అంటే..తమ శాఖల్లో వేలు పెట్టొద్దని మంత్రులు సీఎంకు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. తనకు చెప్పకుండా చెక్‌పోస్టులు ఎలా రద్దు చేస్తారని పొన్నం ప్రభాకర్ నిలదీసినట్లు ఇన్ సైడ్ టాక్. తన ఆదేశాలనే పాటించనప్పుడు మంత్రి పదవి ఎందుకని జూపల్లి ఆవేదన వ్యక్తం చేశారట.

"కాంట్రాక్టుల" సమస్యను రేవంత్ రెడ్డి సెటిల్ చేశారా?

సేమ్‌టైమ్ కొండా సురేఖ, పొంగులేటి కాంట్రాక్టుల సమస్యను కూడా రేవంత్ రెడ్డి సెటిల్ చేసినట్లు సెక్రటేరియట్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే



ఎవరికి ఎలాంటి సమస్య ఉన్న తనకు చెప్పాలని రేవంత్ రెడ్డి మంత్రులను పదే పదే కోరారని..మీడియా ముందు ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారని అంటున్నారు.అంతేకాదు తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం ఫెయిల్ అని ఏఐసీసీ చీఫ్ ఖర్గే అన్నట్లుగా జరుగుతోన్న ప్రచారంపై మండిపడ్డారట రేవంత్. తనను ఫెయిల్యూర్ సీఎంగా చూపించే కుట్ర జరుగుతుంటే ఏం చేస్తున్నారంటూ అమాత్యులపై ఫైర్ అయ్యారట రేవంత్. తాను ఫెయిల్ అయితే మంత్రులు, కాంగ్రెస్ పార్టీ కూడా విఫలమైనట్లు కాదా అని ఆయన ప్రశ్నించినట్లు తెలుస్తోంది.అయితే క్యాబినెట్ భేటీ తర్వాత ఇన్ని విషయాలు బయటికి వచ్చాయంటే..ఇక సమావేశంలో చర్చించిందేముంటుందన్న టాక్ వినిపిస్తోంది. మంత్రులతో సెపరేట్‌గా మాట్లాడారట సీఎం. అధికారులను బయటికి పంపించి..ప్రత్యేకంగా సీఎం, మంత్రులే కొద్దిసేపు వాదనకు దిగారని అంటున్నారు. ఆ తర్వాత ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత ప్రస్తావన మంత్రి వర్గ సమావేశాన్ని మమ అనిపించారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ నెల 23న జరిగిన క్యాబినెట్ భేటీలో ఒక్క ప్రజా సమస్యపై కూడా చర్చ జరగలేదని..పక్కా పర్సనల్ విషయాల కోసమే మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించారని అంటోంది.ఈ క్రమంలోనే రాష్ట్ర క్యాబినెట్ దండుపాళ్యం ముఠాలా తయారైందంటూ మాజీమంత్రి హరీశ్‌రావు మాట్లాడాల్సి వచ్చిందని చెబుతున్నారు బీఆర్ఎస్ నేతలు. పంపకాలు, పర్సనల్ పంచాయితీల కోసమే క్యాబినెట్ భేటీ అంటూ హడావుడి చేస్తున్నారని కారు పార్టీ లీడర్లు మండిపడుతున్నారు. ఈ క్రమంలో స్టేట్ క్యాబినెట్ భేటీ చుట్టూ..రాష్ట్ర రాజకీయం తాండవం చేస్తోంది. అయితే మంత్రివర్గ సమావేశంలో ఏం చర్చించారనే దానిపై మాత్రం ఓ క్లారిటీ రాని పరిస్థితి ఉంది.

## మా ఆదేశాలపై ఇంత నిర్లక్ష్యమా?

న్యూఢిల్లీ,వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నా రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సుప్రీంకోర్టు మండిపడింది. వాటిని ఎక్కడికక్కడ పట్టుకుని.. స్టెరిలైజ్ ఇంజక్షన్లు చేసి విడిచిపెట్టాలని, దీనిపై అఫిడవిట్లు దాఖలుచేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)లకు ఆగస్టు 22న ఆదేశాలు జారీచేస్తే.. తమిళనాడు, బెంగాల్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ తప్ప మిగతా రాష్ట్రాలు, యూటీలేవీ ఇంతవరకు అఫిడవిట్లు వేయకపోవడాన్ని ఆక్షేపించింది. ఆ మిగతా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులంతా వచ్చే నెల 3వ తేదీన జరిగే విచారణ సందర్భంగా తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. జంతువుల జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనలకు అనుగుణంగా కుక్కల షెల్టర్లు, అందుబాటులో ఉన్న వెటర్నరీ డాక్టర్లు, కుక్కలు పట్టే సిబ్బంది, ప్రత్యేక వాహనాలు, బోన్లు తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్రాలు, యూటీల పురపాలక అధికారులను ఆగస్టు 22న ఆదేశించింది. ఈ ఆదేశాలు జారీచేశాక కూడా పలు చోట్ల వీధికుక్కల దాడులు జరిగాయని తెలిపింది. 'గత నెలలో మహారాష్ట్రలోని పుణేలో ఓ చిన్నారిపై దాడిచేశాయి. అంతకు కొన్ని రోజుల ముందు భండారా జిల్లాల 20 కుక్కలు ఓ అమ్మాయిపై దాడిచేశాయి. గత వారం కేరళలో కన్నూర్ జిల్లాలో వీధి కుక్కలపై వీధినాటకం ప్రదర్శిస్తున్న వ్యక్తిపైనే దాడిచేశాయి. యూపీలోని లఖ్‌నవూలో ఒకే కుటుంబంలో ముగ్గురిని కరిచాయి. గత 48 గంటల్లో తెలంగాణలోని వరంగల్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. అయినా రాష్ట్రప్రభుత్వాల నుంచి స్పందన లేదు. దేశంలో నిరంతరం పిల్లలు, వృద్ధులు, మహిళలు.. ఇలా అందరిపై కుక్కలు దాడులు చేస్తుంటే.. విదేశాల్లో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మన దేశాన్ని అంతర్జాతీయంగా చెడుగా చిత్రిస్తున్నారు. ఆగస్టు 22న మేమిచ్చిన ఆదేశాలపై



విస్తృతంగా ప్రచారం జరిగింది. రెండు నెలలు గడువిచ్చినా స్పందన లేదు. అధికారులు దినపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియాలో చూడడం లేదా? పేరుపేరునా నోటీసులివ్వాలా' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. కనీసం ఆయా రాష్ట్రాల తరఫు న్యాయవాదులు సైతం విచారణ సమయంలో లేకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 3వ తేదీన సీఎసలు తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వకుంటే.. బహిరంగంగా కోర్టు నిర్వహిస్తామని హెచ్చరించింది. 3న అఫిడవిట్ వేస్తామని ఢిల్లీ ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలుపగా.. సీఎస్ తమ ముందు హాజరు కావలసిందేనని తేల్చిచెప్పింది. 'ఆయన అఫిడవిట్ వేస్తే వేయనివ్వండి. కానీ మా ఆదేశాలపై ఎందుకు స్పందించలేదో వివరణ ఇవ్వాల్సిందే. ఆయన రాకుంటే ఖర్చులు విధించడంతో పాటు కఠిన చర్యలు ఉంటాయి' అని పేర్కొంది. కోర్టు ఆదేశాలు వీధికుక్కల పాలిట మరీ క్రూరంగా ఉన్నాయని ఓ న్యాయవాది ప్రస్తావించగా.. మనుషుల పట్ల క్రౌర్యం గురించి ఏం చెబుతారని ధర్మాసనం నిలదీసింది.

## హరీశ్ రావు తండ్రి భౌతిక కాయానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్..



హైదరాబాద్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. వయోభారం, అనారోగ్యం కారణాల వల్ల ఆయన మరణించినట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి.

కాగా.. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సత్యనారాయణ రావు భౌతిక కాయానికి నివాళులర్పించారు. పుష్పాంజలి ఘటించారు. తన బావ సత్యనారాయణ రావు (కేసీఆర్ 7వ సోదరి లక్ష్మీ భర్త)తో తన అనుబంధాన్ని స్మరించుకున్నారు. తన సోదరి లక్ష్మిని, ఇతర కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించి, ఓదార్చారు.భౌతికకాయానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. హరీశ్ రావును హత్తుకొని ఓదార్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అదేవిధంగా హరీష్ రావు తండ్రి సత్యనారాయణ మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని.. హరీశ్ రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.సత్యనారాయణ రావు మృతికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంతాపం వ్యక్తం చేశారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. హరీశ్ రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా పలువురు బీఆర్ఎస్ నేతలు, ఇతర పార్టీల రాజకీయ ప్రముఖులు సత్యనారాయణ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

## లీడర్ నుంచి కేడర్ వరకు అంతా అక్కడే



అమరావతి, మొంథా తుపాను నేపథ్యంలో సీఎం చంద్రబాబు కూటమి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను దృష్ట్యా ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. లీడర్ నుంచి కేడర్ వరకు ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలంతా అందుబాటులో ఉండాలన్నారు. కూటమి కార్యకర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అవసరమైతే కేంద్ర సాయం కూడా కోరతామన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడి నష్టాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాత్రికి మచిలీపట్నం–కళింగపట్నం మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉంది. రియల్ టైమ్‌లోనే మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నాం. పంట నష్ట నివారణ చర్యలను అధికారులకు తెలియజేశాం. ఆకస్మిక వరదల దృష్ట్యా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మోహరించాం అని సీఎం తెలిపారు. మొంథా తుపాన్ రాష్ట్రాన్ని గడగడాలాడిస్తోంది. ఈ క్రమంలో ఎన్డీయే కూటమి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాన్ కారణంగా రెండ్రోజులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని నేతలకు సీఎం పిలుపునిచ్చారు. లీడర్ నుంచి కేడర్ వరకు ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు, కార్యకర్తలంతా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మొంథా తుపాన్ రాష్ట్రంపై ప్రభావం చూపే అవకాశం ఉందని.. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం కాకినాడకు 270 కి.మీ దూరం నుంచి 15 కి.మీ వేగంతో రాష్ట్రం వైపు వస్తోందని తెలియజేశారు. ఈ రోజు రాత్రికి సివియర్ సైక్లోన్‌గా మారి మచిలీపట్నం – కళింగపట్నం మధ్య తీరం దాటుతుందని తెలిపారు. తుపాన్ ప్రభావంతో కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ఎన్డీయే శ్రేణులు నేడు, రేపు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచనలు చేశారు. పరిస్థితి తీవ్రతను బట్టి రియల్ టైంలోనే మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పంటలను మునకనుంచి కాపాడేందుకు ఏం చర్యలు తీసుకోవాలో అధికారులకు తెలియజేశామని.. ప్రాణ నష్టాన్ని పూర్తిగా తగ్గించడంతో పాటు ఆస్తి నష్ట నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజలను చైతన్యపరుస్తూ ఎన్డీయే కార్యకర్తలు స్వచ్ఛంధ సేవకులుగా ముందుకు వచ్చి సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అవసరమైతే కేంద్ర సాయం కూడా కోరతామన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడి నష్టాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. సంక్షోభ సమయాల్లో ప్రజల చెంతనే ఉండాలన్నారు. తుపాను సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగానికి ఎన్డీఏ పార్టీల యంత్రాంగం సహకరించాలని కోరారు. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణిలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తిత్లీ, హుద్‌హుద్ తుఫాన్ వచ్చినప్పుడు కూడా సమర్థవంతంగా ఎదుర్కొన్నామని గుర్తుచేశారు. విపత్తులు వచ్చినప్పుడు సమర్థవంతంగా వ్యవహరిస్తారనే నమ్మకం ప్రభుత్వంపై ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామ న్నారు. చెట్లు, స్తంభాలు వంటివి కూలినా యుద్ధ ప్రాతిపదిన తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందన్న సమాచారంతో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని క్షేత్రస్థాయిలో మోహరించామన్నారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను వెనక్కి రప్పించామని.. వారితోనూ ఎన్డీయే శ్రేణులు సమన్వయంతో ఉండాలని సూచించారు. ప్రతి గంటకు బులిటెన్ కూడా విడుదల చేస్తామని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సహా కేడర్ నుంచి లీడర్ వరకు ప్రజలకు అండగా నిలబడాలని సూచించారు. కూటమిని ఆదరించిన ప్రజలకు తోడుగా ఉండాలని వెల్లడించారు. దాదాపు 39 నియోజకవర్గాలకు వర్ష ప్రభావం ఎక్కువగా చూపిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## పాకిస్థాన్ బరితెగింపు.. భారత పోస్టులపై దాడులు

న్యూఢిల్లీ, ఆపరేషన్ సింధూర్ తో తీవ్రంగా దెబ్బకొట్టినా పాకిస్థాన్ సైన్యం తీరుమారలేదు. మరోసారి బరితెగించి కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచింది. సరిహద్దుల్లో భారత స్థావరాలపై కాల్పులకు పాల్పడింది. జమ్ముకశ్మీర్‌లోని లీపా వ్యాలీ లో అక్టోబర్ 26, 27 తేదీల నడుమ వచ్చే రాత్రి ఈ ఘటన జరిగింది.కాల్పులు, మోర్టార్ దాడులకు పాల్పడింది. అయితే భారత సైన్యం పాకిస్థాన్‌కు ధీటుగా బదులిచ్చింది. పాకిస్థాన్ దాడిని సమర్థంగా తిప్పికొట్టింది. భారత జవాన్‌లు తీవ్రంగా ప్రతిఘటించడంతో పాక్ సైనికులు తోకముడిచారు. కాగా పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా అప్పట్లో ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత సైన్యం పాకిస్థాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్‌కు పాల్పడింది. దాంతో పాక్ కాళ్లబేరానికి వచ్చింది.ఫలితంగా ఈ ఏడాది మే 10 నుంచి రెండు దేశాల సైనికుల మధ్య నియంత్రణ రేఖ వెంబడి ఎలాంటి ఘటనలు చోటుచేసుకోలేదు. అంతా ప్రశాంతంగా ఉంది. కానీ తాజాగా పాకిస్థాన్ మళ్లీ బరితెగించడం ఆ దేశం



వక్రబుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది.

## విద్యార్థుల సమగ్ర వికాసానికి కథలు దోహదం...



రామగిరి, అక్టోబర్ 28 : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, సమగ్ర వికాసానికి కథలు ఎంతగానో దోహద పడతాయని పిల్లల కథా రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ మర్రిగూడ ప్రాథమిక ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని గుట్టకింది అన్నారం ప్రాథమిక పాఠశాలకు తాను రాసిన బంతిపూలు, బహుమతి, మొలకలు, ఊగుతున్న ఉయ్యాల, బాల చెలిమి, చేతిరాత వంటి బాల సాహిత్య పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా రచయిత బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. పిల్లలు చిన్నప్పటి నుండే కథలు చదివే అలవాటు చేసుకోవాలన్నారు. ఇప్పటికే అనేక ప్రభుత్వ పాఠశాలలకు బాల సాహిత్య పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనిమద్దె సైదులు, గౌతమి, గ్రామ కార్యదర్శి సాయి చరణ్, కోమటిరెడ్డి అరుణ, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

## సంపాదకీయం

**బుధవారం 29-10-2025**

# డెత్ ట్రావెల్స్...

గాల్లో తేలుతున్నదో... రోడ్డుపై ఉరకలెత్తుతున్నదో తెలియనంత పెనువేగంతో దూసుకు పోయే ట్రావెల్స్ బస్సు శుక్రవారం వేకువజామున కర్నూలు సమీపాన ప్రమాదంలో చిక్కుకుని 19 మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. ఇటీవల ఈ రకం బస్సులు తరచూ ప్రమాదాలకు లోనవుతున్నాయి. పదిరోజుల క్రితం రాజస్థాన్‌లో కూడా ఇలాంటి బస్సే తగలబడి 20 మంది మరణించారు. ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొనటంతో తాజా ప్రమాదం జరిగిందంటున్నారు. చూడటానికి భారీగా కనిపిస్తూ మెరిసే అద్దాలతో, సకల హంగులతో, స్లీపర్ కోచ్‌లుగా ఉండే ఈ బస్సులు తక్కువ వ్యవధిలో గమ్యాన్ని చేరుస్తా యని ఆశిస్తారు. అంత వేగంతో పోవటానికి అవసరమైన ఏర్పాట్లున్నాయెా లేదో ఎవరూ గమనించుకోలేరు. ఇవి రోడ్డెక్కింది మొదలుకొని పాదచారుల నుంచి వాహనదారుల వరకూ అందరినీ హడలెత్తిస్తాయి. డిజైన్ రీత్యా చూసినా, బస్సు అంతర్నిర్మాణంఅందంగా కనబడటానికి వాడే మెటీరియల్ గమనించినా అవి ఏమాత్రం సురక్షితం కాదని తెలిసిపోతుంది. సీట్ల మధ్య తక్కువ స్థలం ఉండటంవల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులకు తప్పుకునే వ్యవధి ఉండదు. ఇవి ఎక్కువగా రాత్రివేళల్లో వెళ్తుంటాయి కాబట్టి ప్రయాణికులు నిద్రలోకి జారుకుంటారు. మెలకువ వచ్చి ఏదో జరిగిందనిగుర్తించేలోపే మంటలు చుట్టుముడతాయి. కనీసం పక్కవారిని అప్రమత్తం చేయటం మాట అటుంచి, గమనించినవారు తప్పుకోవటమే అసాధ్యమవుతుంది. గందరగోళం ఏర్పడి తోపులాట చోటుచేసుకుంటుంది. ఇక సురక్షితంగా బయటపడేదెక్కడ? సుదూర ప్రయాణాల్లో డ్రైవర్లకు తగిన విశ్రాంతికి సమయం చిక్కకపోతే, అలసటకు లోనయితే కునుకుతీసే ప్రమాదం ఉంటుంది. రాత్రివేళ ప్రమాదాలకు ఇదొక కారణం.దానికితోడు బస్సు లోపల సర్వసాధారణంగా బెర్త్‌ల కోసం వాడే ఫైబర్, రెగ్జిన్, తెరల కోసం ఉపయోగించే పాలియెస్టర్, సిల్క్ వగైరాలు మండే స్వభావం ఉండేవి. చిన్న నిప్పురవ్వ చాలు... సెకన్ల వ్యవధిలో భగ్గున మండటానికి! నిప్పంటుకున్నప్పుడు కేబుళ్లు దగ్ధమై ఎమర్జెన్సీ డోర్‌లు సైతం మొరాయిస్తాయి. అదృష్టవశాత్తూ తెరుచుకునే సందర్భా లున్నా కనీసం 8,9 అడుగుల ఎత్తులో స్లీపర్‌లపై ఉన్నవారు వాటివద్దకు చేరుకోవటం అయ్యే పనేనా? అద్దాలైనా అంత సులభంగా బద్దలుకావు. ఇవన్నీ ముప్పును మరింత పెంచేవే. ఈ రకం బస్సుల సంక్లిష్ట నిర్మాణం వల్ల ప్రమాదాల్లో చిక్కుకున్నప్పుడు బయటి వారు సాయపడాలన్నా అసాధ్యమే. రోడ్డు ప్రమాదాలు సహజంగా జరిగేవికాదని, మనుషుల తప్పిదాల వల్లా, నిర్లక్ష్యంవల్లా అవి చోటుచేసుకుంటాయని గతంలో ఫార్ములా వన్ ఛాంపియన్‌షిప్ గెలిచిన వ్యాపారి మారియో గాబ్రియెల్ అన్నారు. తాజా ప్రమాదం విషయంలో కూడా అది అక్షరాలా నిజం. స్లీపర్ బస్సులు సాధారణంగా ఏసీ సదుపాయంతో ఉంటాయి. సాధా రణ బస్సులతో పోలిస్తే ఈ బస్సుల్లో అధిక విద్యుత్ అవసరమవుతుంది. ఏసీని కనీసం 24 డిగ్రీల వద్ద ఉంచాలి. కానీ అంతకన్నా తగ్గిస్తే చల్లదనం పెరగొచ్చుగానీ దానివల్ల విద్యుత్ వినియోగం ఎక్కువవుతుంది. ఆ మేరకు కేబుళ్లపై ఒత్తిడి పెరిగి అవి త్వరగా వేడెక్కుతాయి. కంప్రెసర్ గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. దానికి మధ్యమధ్యలో విరామం ఇవ్వకపోతే పనితీరు దెబ్బతింటుంది. వీటన్నిటినీ ఎప్పటికప్పుడు తనిఖీ చేసు కుంటూ అవసరాన్నిబట్టి మారుస్తుం డాలి. లేనట్టయితే షార్ట్ సర్క్యూట్‌కు దారితీస్తుంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేవారు వీటిని నిశితంగా గమనిస్తున్నారా? ప్రమాదానికి లోనయిన బస్సు ఫిట్‌నెస్ బాగానే ఉందని రవాణా అధికారులు చెబుతున్నారు. అందులోని నిజానిజాల సంగతటు ంచి అంతటి పెనువేగంతో వెళ్లేందుకు అనువుగా మన రోడ్లు ఉంటున్నాయా? అధిక వేగంతో పోయే వాహనాలను నడిపేవారి సామర్థ్యాన్ని కొలిచేందుకు విడిగా పరీక్షలుం టున్నాయా? ఎంతో చురుగ్గా ఉండేవారు చోదకులుగా ఉంటే క్లిష్ట సమయాల్లో తక్షణం స్పందించగలుగుతారు. లేనట్టయితే పెను ప్రమాదాలకు కారణమవుతారు. అసలు ఈ మాదిరి బస్సులపై రెండు దశాబ్దాల క్రితంనుంచే చైనా, జర్మనీ వంటి దేశాల్లో నిషేధం అమలవుతోంది. మన దేశం కూడా ఆ దిశగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైనట్టే ఉంది.

# తీరు మార్చుకోని కాంగ్రెస్ ప్రభుత్వం



హైదరాబాద్,ఎలుకతోలు తెచ్చి ఎన్నేళ్లు ఉతికినా...నలుపునలుపేగాని తెలుపు గాదయా అని సామెత. కాంగ్రెస్ పార్టీకి ఇది బాగా సరిపోతుంది. కెసిఆర్‌పై అసహనం, కెటిఆర్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించడం..కుటుంబ పాలనా పెత్తనం వంటివన్నీ సహించలేక బిఆర్ఎస్ పాలనపై విసుగుతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు తప్ప.. కాంగ్రెస్ హామీలపైనో లేదా రేవంత్‌పై ప్రేమతోనో లేదా..రాహుల్, సోనియాలపై భక్తితోనే ప్రజలు ఓట్లు వేయలేదు. అలాగే బిజెపి ఆడిన నాటకాలు కూడా ప్రజలు తిరస్కరించారు. బండి సంజయ్ రాకతో బిజెపి మంచి స్థితికి వచ్చింది. కానీ బిజెపి అధ్యక్షుడిగా సంజయ్‌ను తలగించడం, కెసిఆర్‌తో లోపాయకారి ఒప్పందం చేసుకోవడం వంటి కారణాలతో కూడా బిజెపికి దక్కాల్సిన అధికారం కాంగ్రెస్‌కు దక్కింది. ఇవన్నీ నిజాలు. కానీ కాంగ్రెస్ పార్టీ ఇవన్నీ మరచిపోయి పాలన సాగిస్తోంది. బిఆర్ఎస్ పాపాలను విమర్శిస్తున్న వీరు తాము కూడా అదేపనిలో ఉన్నారు. పైరవీలు, పర్సెంటేజీలు, బెదరింపులు వంటి వ్యవహారాలపై బలంగా ప్రచారం సాగుతోంది. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు ఒక్కటంటే ఒక్కటి తీసుకోవడం లేదు. ఆరు గ్యారెంటీలు, అప్పులు తప్ప చేసిన నిర్ణయాత్మక కార్యక్రమాలు లేవు. మంత్రుల్లో అనైక్యత కారణంగా పనులు సాగడం లేదు. గుంటల రోడ్లను కూడా పూడ్చలేని అసమర్థత కనిపిస్తోంది. కాంగ్రెస్ రాజకీయాలు గతంలో కూడా ఇలాగే ఉండేవి. అందుకే ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారు. ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారం చేపట్టాక కాంగ్రెస్ మార్కు రాజకీయాలను ప్రజలు మరచిపోయేలా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004లో ముఖ్యమంత్రి అయిన రాజశేఖరరెడ్డి పార్టీ పైన, ప్రభుత్వంపైన పూర్తి పట్టు సాధించారు. దీంతో కాంగ్రెస్‌లో అసంతృప్త స్వరాలు, పాత జమానా తాలూకు వ్యవహారాలు కనపించకుండా పోయాయి. ప్రభుత్వంపై వైఎస్ తనదైన ముద్ర వేశారు. రాజశేఖరరెడ్డి కూడా కాంగ్రెస్‌ను ప్రాంతీయ పార్టీ స్థాయిలోనే నడిపారు. ఏక వ్యక్తి పాలనకు, ప్రాంతీయ పార్టీల కల్చర్‌కు అలవాటుపడిన తెలుగు ప్రజలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు జీర్ణించుకోవడం లేదు. ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో దశా దిశా లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోంది. క్షేత్రస్థాయిలో పనులు కావడం లేదని సొంత పార్టీ ఎమ్మెల్యేలే గట్టిగా స్వరం వినిపిస్తున్నారు. మరోవైపు నిధుల కొరత కారణంగా చిన్న చిన్న పనులు కూడా మంజూరు చేయించలేని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ పరిణామాలతో వారిలో అసంతృప్తి చోటుచేసుకుంటోంది. ప్రభుత్వంలోనే కాదు, పార్టీలోనూ సిఎం రేవంత్‌రెడ్డికి పట్టు లేదన్న అభిప్రాయం బలపడుతోంది. ఎన్నికలకు ముందు రేవంత్ మాటతీరు, హామీల తీరు చూసి రేవంత్ రెడ్డి కూడా అలాగే వ్యవహరిస్తారనీ, కొత్తగా సంచనల నిర్ణయాలతో ముందుకు సాగాలని ఆశించారు. అయితే, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సురేఖ దంపతులపై ప్రజల్లో ముందునుంచీ సదభిప్రాయం లేదు. తాజా వ్యవహారంలో ఆమెపై చర్యలు తప్పవని అంతా భావించారు. ఆమె కుమార్తె అన్న మాటలకు సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి ఉండాలి. అయితే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవ తీసుకొని కొండా సురేఖను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లారు. దీంతో ఆయన అప్పటికి శాంతించారు. నిజంగానే చర్యలు తీసుకుని ఉంటే కాంగ్రెస్ ఇమేజ్ పెరిగేది. సురేఖ దంపతులతో రేవంత్‌రెడ్డి రాజీ కుదుర్చు కున్నారన్న అభిప్రాయం ప్రజల్లో అసంతృప్తిని కలిగించింది. మరో వైపు మంత్రులు ఎవరికి వారు సర్వ స్వతంత్రులుగా వ్యవహరిస్తున్నారు. ఆ శాఖ, ఈ శాఖ అని లేకుండా అన్ని శాఖల్లో జోక్యం చేసుకుంటు న్నారని అంటున్నారు. ఎవరికి వారు ముఖ్యమంత్రులుగా భావించి వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రిని ప్రైవేట్ సందర్భాల్లో విమర్శిస్తున్న వారు కూడా ఉన్నారు. దీనికితోడు ప్రభుత్వంలో వివిధ స్థాయిలలో అవినీతి పెరిగిపోయింది. గ్రామపంచాయితీ లెవల్లో వేయి చేతిలో పెట్టనిదే ఏ పనీ జరగడం లేదు. ఎసిబి దాడులు చేస్తున్నా పిసరింత ప్రభావం కూడా కనిపించడం లేదు. ఉద్యోగుల అవినీతిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. కానీ అలా జరగడం లేదు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులపై పట్టు లేదన్న వాదన బలపడింది. ఇకపోతే గందరగోళ నిర్ణయాలకు తోడు, అదేపనిగా గత బిఆర్ఎస్‌పై విమర్శలు చేస్తూ సాగుతున్నారు. దానిబదులు ఏదైనా అవినీతిపై గట్టి చర్య తీసుకుని ఉంటే ప్రభుత్వ ఇమేజ్ పెరిగి ఉండేది. అలా కాకుండా కాంగ్రెస్ అధిష్టానానికి సంచులు మోస్తున్నారన్న ప్రచారం గ్రామస్థాయిలో నాటుకు పోయింది. ఇక ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కూడా బెడిసి కొడుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలన్న నిర్ణయం విషయంలో అపరిపక్వత బయటపడింది. ప్రజల్లో చులకన అయ్యారు. ముందూ వెనుకా ఆలోచించకుండా, చట్టపరమైన సమస్యలను అధ్యయనం చేయకుండా నిర్ణయం తీసుకోవడంతో ప్రభుత్వం అభాసుపాలయ్యింది. 42 శాతం రిజర్వేషన్లు ఇప్పించే బాధ్యత బిజెపిదేనంటూ దానిపై నెపాన్ని మోపడం కూడా చేతకానితనాన్ని రుజువు చేసింది. 42శాతం హామీ ఇచ్చింది కాంగ్రెస్ అయితే దానికి బిజెపిని బద్నాం చేయడం కూడా ప్రజలకు రుచించడం లేదు. పర్యవసానాలు ఆలోచించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకుంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు అమలులో ఉన్నందున ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టులు కొట్టిపారేశాయి. దీంతో బీసీల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. రిజర్వేషన్లు పెంచడానికి అసెంబ్లీలో మద్దతు ప్రకటించిన రాజకీయ పార్టీలు ఇప్పుడు బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వంపైకి నెట్టి తప్పుకొంటున్నాయి. ఫలితంగా ఈ సమస్య పరిష్కార బాధ్యత ప్రభుత్వంపై పడింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధిస్తే కొంత ఇమేజ్ పెరుగుతుంది. లేదంటే అతఃపాతాళానికి పతనం తప్పదు. బిసికి టిక్కెట్ ఇచ్చి ప్రచారం చేస్తున్నా.. ఫలితం అందుకు విరుద్ధంగా ఉంటే మాత్రం ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మరింత పెరుగుతుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకుని బాధ్యతగా ముందుకు నడిపించాల్సిన ర ఆహుల్ సొంత రాజకీయాలతో మునిగి పోయారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలను చూసీచూడనట్లుగా పోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ పుట్టి మునగడం ఖాయం. ఎందుకంటే కాంగ్రెస్ పాలనాతీరు చూస్తున్న ప్రజలు కెసిఆర్ నయం అన్న భావనకు వస్తున్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ మారకుంటే కాంగ్రెస్ పార్టీ మళ్లీ తెలంగాణలో ఇక అధికారంలోకి రావడం కల్ల.

# స్లీపర్ ట్రావెల్స్.. డేంజర్ బెల్స్




హైదరాబాద్,ఇప్పుడు స్లీపర్ బస్సుల పేరు చెబితే భయం కలుగుతోంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో శుక్రవారం (24.10.25) తెల్లవారు జామున చెలరేగిన మంటలు అనేక మందిని సజీవ దహనం చేసిన సంఘటన స్లీపర్ బస్సుల నిర్వహణ లోపాలకు సాక్షంగా మరోసారి చర్చనీయాంశం అవుతోంది. ఈ ప్రమాదంలో దాదాపు 20 మంది ప్రాణాలు కోల్పోగా, పది రోజుల క్రితం రాజస్థాన్‌లోనూ ఇలాంటి ప్రమాదమే జరిగి 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి ప్రమాదాల కారణంగానే కొన్ని దేశాల్లో స్లీపర్ బస్సుల వినియోగాన్ని బాగా తగ్గించేశారు. చైనాలో 2009 తర్వాత నుంచి 13 స్లీపర్ బస్సు ప్రమాదాలు జరిగి 252 మంది ప్రాణాలు కోల్పోవడంతో 2012 లో వీటి రిజిస్ట్రేషన్లను చైనా నిలిపివేసింది. మన దేశంలో స్లీపర్ బస్సులు చాలా పాప్యులర్ పొందాయి. చాలా మంది ప్రయాణికులు తమ సుదీర్ఘ ప్రయాణంలో ఈబస్సుల్లో హాయిగా నిద్రపోవచ్చని ఇష్టపడుతుంటారు.కానీ తరచుగా ప్రమాదాలు జరుగుతుండడంతో వీటి భద్రతపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు సాధారణంగా స్లీపర్ బస్సుల రిజిస్ట్రేషన్లకు అధికారికంగా అనుమతించడం లేదు. కానీ చాలామంది ఆపరేటర్లు స్థానిక నిబంధనలను పక్కన పెట్టి ఉత్తరాది రాష్ట్రాల్లో కొన్ని చోట్ల తమ బస్సులకు రిజిస్ట్రేషన్లు చేయించి ఈ రాష్ట్రాల్లో నడుపుతున్నారు. ఈ వక్ర మార్గాలు నిజంగా భద్రతా ప్రమాణాలు అమలవుతున్నాయా లేదా అన్న సందేహాలకు దారితీస్తున్నాయి. ఘోర ప్రమాదాలకు దారి తీస్తున్న స్లీపర్ బస్సుల భద్రత ప్రమాణాలను కట్టుదిట్టం చేయడం ప్రభుత్వ అధికారుల ప్రస్తుత కర్తవ్యం. భద్రతా ప్రమాణాలతో ఫ్యాక్టరీలో తయారైన బస్సులనే రోడ్లపైకి అనుమతించాలి. అత్యధిక లాభాల కోసం అనధికారికంగా బస్సుల డిజైన్లను ఆపరేటర్లు మార్చకుండా నియంత్రించాలి. అలాగే రెగ్యులర్‌గా వీటిపై తనిఖీలు జరగాలి. స్లీపర్ బస్సుల్లో ఓవర్ లోడ్‌ను అనుమతించరాదు.ఎన్ని సౌకర్యాలు ఉన్నా ప్రాణాలకు రిస్కుగా మారకూడదు. బస్సుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే పొగకమ్ముకోవడం ప్రయాణికులకు ఊపిరాడక వెంటనే తప్పించుకునే దారి కనిపించడం లేదు. ఈలోగా జరగవలసిన నష్టం జరిగిపోతోంది. స్లీపర్ బస్సులో ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసరంగా తప్పించుకునే ఏర్పాట్లు ఎంతవరకు ఉన్నాయో మొదట తప్పనిసరిగా పరిశీలించుకోవడానికి బదులు కేవలం తమ సౌకర్యాలపైనే ప్రయాణికులు దృష్టి పెడుతున్నారు. మొదట్లో కొన్ని మాత్రమే స్లీపర్ బస్సులుండేవి. అయితే ట్రావెల్ ఆపరేటర్లు చాలామంది తమ మామూలు సీటింగ్ బస్సులను కూడా స్లీపర్ కోచ్‌లుగా మార్చేసి అత్యధికంగా ఛార్జీలు పిండుకోవడం ప్రారంభించారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలతో తయారైన బస్సులను ప్రైవేట్‌గా తమ ఇష్టం వచ్చినట్టు ఆపరేటర్లు వాటి డిజైన్ మార్చేయడం పరిపాటి అయింది. బస్సు కిటికీలు తరచుగా మూసి ఉంటాయి. బస్సులో టివి స్క్రీన్లు, మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్ కనెక్షన్లకు ఛార్జింగ్ చేసుకునే సౌకర్యం తదితర హంగులు ఉండడంతో పవర్ లోడ్ అధికమై షార్టు సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగే ప్రమాదాలు ఎదురవుతుంటాయని కొందరు ప్రయాణికులు చెబుతుంటారు.బస్సులో ప్రవేశించడానికి, బయటకు రావడానికి ఒకే ద్వారం తెరిచి ఉంటుంది. సాధారణంగా వీటి ఎత్తు 8 నుంచి తొమ్మిది అడుగుల వరకు ఉండడంతో బస్సు ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ల నుంచి బయటపడడం కష్టమవుతోంది. ఈ బస్సుల్లో 30 నుంచి 36 వరకు బెర్త్‌లు ఉంటాయి. ఒక్కో బెర్తు 6 అడుగుల పొడవు, 2.6 అడుగుల వెడల్పులో ఉంటుంది. ఈ బెర్తులను అనుసంధానించే గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉండడమే అసలు సమస్య. రాత్రివేళల్లో ఇవి అత్యంత స్పీడ్‌తో వెళ్తుండడం డ్రైవర్లకు అగ్నిపరీక్షే. డ్రైవర్లకు ఏమాత్రం అలసట వచ్చినా, మగత కమ్మినా ప్రమాదాలకు దారితీస్తుంటాయి. రాత్రుళ్లు డ్రైవింగ్ సమయంలో 25 శాతం మంది నిద్రమత్తులో ఉంటున్నట్టు 2019 లో నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. అర్ధరాత్రి తర్వాత నుంచి ఉదయం 6 గంటల లోపు డ్రైవర్లు నిద్రమత్తులోకి జారుకునే అవకాశం ఉందని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. ఈ ధోరణిని అరికట్టడానికి కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతిక వ్యవస్థలను కొన్ని నగరాల్లో వినియోగిస్తున్నారు.పుణె వంటి నగరాల్లో డ్రైవర్లు మగతగా ఉన్నారా లేదా పరధ్యానంలో ఉన్నారా లేదా సిగ్నల్ దాటుకుని స్పీడ్‌గా వెళ్తున్నారా? అని పసికట్టి హెచ్చరించే స్మార్ట్ కెమెరాలు వినియోగిస్తున్నారు. డ్రైవర్ ఎన్నిసార్లు కనురెప్పలు మూస్తూ తెరుస్తూ ఉన్నాడో, తరచుగా వాహనం ఎన్నిసార్లు అదుపు తప్పిందో తెలిసిపోతుంది. రెడ్ లైట్ సిగ్నల్ వద్ద డ్రైవర్ ఏ విధంగా అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడో పసిగడతాయి. అలాంటి సమయాల్లో కీచుమని శబ్దం రూపంలో, మరికొన్ని సార్లు స్టీరింగ్ వీల్ ప్రకంపించడం ద్వారా హెచ్చరికలు వస్తుంటాయి. ఇటువంటి ఎఐ వ్యవస్థ డ్రైవింగ్ అవర్స్‌ను ట్రాక్ చేయడమే కాదు, వారు స్మార్ట్‌గా డ్రైవ్ చేయడానికి సహాయపడుతుంది. ఇప్పుడు కొత్తగా బస్సుల్లో డ్రౌజీనెస్ అలర్ట్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నా వాటి పనితీరు సామర్థ్యంపై ఇంకా అనుమానాలు ఉంటున్నాయి. కృత్రిమ మేధ సాయంతో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఢిల్లీ గురుగ్రామ్ ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవేపై కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా అమలు చేయడం చెప్పుకోతగ్గ విశేషం. దీంతో దేశం లోనే మొట్టమొదటి ఎఐ ఆధారిత స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్ కలిగిన డిజిటల్ హైవేగా ఈ రహదారి గుర్తింపు పొందింది. ఈ ప్రక్రియను దేశ వ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులపై అమలు చేయడానికి కేంద్రం యోచిస్తోంది.

### త్వరలోనే ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేస్తాం

హైదరాబాద్,మెగాస్టార్ చిరంజీవి ఫిర్యాదు చేసిన డీప్‌ఫేక్ కేసులో విచారణ చేస్తున్నట్లు నగర సీపీ సజ్జనార్ తెలిపారు. చిరంజీవి ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసిన కేటుగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీప్‌ఫేక్ కేసు విషయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

## మొంథా తుఫాన్ ప్రభావం

అమరావతి,మొంథా తుఫాన్ దూసుకొస్తున్న వేళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు జిల్లాల్లోని పాఠశాలలకు, కాలేజీలకు అధికారులు సెలవులు ప్రకటించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విశాఖ జిల్లాలో సోమవారం,మంగళవారం రెండు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో కూడా కలెక్టర్ విజయ కృష్ణన్ మూడు రోజులు సెలవులు ప్రకటించారు. మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల అన్ని విద్యాసంస్థలను మూసివేసినట్లు పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా విద్యా సంస్థలను తెరిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. మరోవైపు.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా నదులు, వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లు తున్నాయి. సోమశిల డ్యాంలో 70టీఎంసీలు, కండలేరు జలాశయంలో 60టీఎంసీలకు నీరు చేరుకుంది. వెయ్యి హెక్టార్లలో పంటలు నీటి మునిగాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో చేపల వేట, చేనేత పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి విపత్తులు ఎదురైనా సిద్ధంగా ఉండాలని అధికారులకి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తున్నారు

## విశాఖలో జోరుగా తుఫాన్ వర్షం

విశాఖపట్నం,మొంథా తుపాను ప్రభావంతో విశాఖ నగరంలో భారీ వర్షం కురుస్తోంది. పలు చోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి. కైలాసపురంలో గాలుల ప్రభావానికి చెట్లు విరిగిపడ్డాయి. పలు చోట్ల రోడ్డుపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఉండొద్దని జీవీఎంసీ అధికారులు ప్రజలను సూచించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి తుపాను పరిస్థితిని ప్రత్యేకాధికారి అజయ్‌జైన్ పర్యవేక్షిస్తున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆయన ఆరా తీశారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలను స్థానిక అధికారుల ద్వారా అప్రమత్తం చేయాలని సూచించారు. మరోవైపు అనకాపల్లి జిల్లాలోని పలు జలాశయాల వద్ద అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాల వద్ద ఏఈలతో కూడిన బృందం 24 గంటలూ విధుల్లో ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. తాండవ జలాశయంలో నీటిమట్టం పెరగడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని పలు తీర ప్రాంత గ్రామాల్లో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని రేవు పోలవరం, బంగారంపేట, బోయపాడు, రాజయ్యపేట, పెంటకోట, పాల్మన్‌పేట తదితర చోట్ల మత్స్యకారులను వేటకు వెళ్లకుండా మెరైన్ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంతాలకు పర్యాటకులు రావద్దన్నారు. తీర ప్రాంతంలో సోమవారం ఉదయం నుంచి జల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. తుపాను కారణంగా పెంటకోట, పాల్మన్‌పేట తీరాల్లో అలలు ఎగసిపడుతున్నాయి. పాయకరావుపేట పరిధిలో ఉన్న తాండవ రిజర్వాయర్ నుంచి 310 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. తాండవ పరివాహక ప్రాంతాలైన కోటనందూరు, నాతవరం, పాయకరావుపేట పట్టణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదలశాఖ అధికారులు సూచించారు.

## బావా,బామ్మర్దుల నస భరించలేకున్నాం

హైదరాబాద్, బావ, బామ్మర్దుల నస భరించాల్సిన పరిస్థితి తెలంగాణ ప్రజలకు పట్టిందంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్న పదేళ్లు బందిపోట్ల లాగా దోచుకున్నారని ఆయన విమర్శించారు. 'బీఆర్ఎస్ నాయకులు ఇంత దిగజారి మాట్లాడతారా? బీఆర్ఎస్ మంత్రులకు సెల్ఫ్ రెస్పెక్ట్ లేకుండే. బీఆర్ఎస్ మంత్రుల్లో వెన్నెముక ఎవరికీ లేకుండే. ముఖ్యమంత్రిపై ఎక్కువ మాట్లాడే దరిద్రులను హెచ్చరిస్తున్నా. ఆటో కార్మికులు చనిపోయిన రోజు బీఆర్ఎస్ నేతలు ఎక్కడ ఉన్నారు? మంత్రి వర్గాన్ని కించపరిచిన వారిపై కార్యాచరణ ప్రకటిస్తాం.' అంటూ అద్దంకి తిట్లదండకం అందుకున్నారు.తెలంగాణ ఉద్యమంలో పారిపోయిన హరీశ్.. ఇప్పుడు అడ్లూరిని చూసి పారిపోయారని అద్దంకి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు అమ్మపాలు తాగి రొమ్ము గుద్దే రకం అంటూ ఆరోపించారు. సొంత మనిషి కవిత.. తనకి అన్యాయం జరిగిందని చెప్పినా పట్టించుకోవడం లేదని అద్దంకి అన్నారు. అప్పుడు బీఆర్ఎస్ ను ప్రజలు గెలిపించడం.. తెలంగాణను దోచుకోవడానికి బీఆర్ఎస్ పార్టీకి లైసెన్స్ ఇచ్చినట్టు అయింది అని అద్దంకి తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ఇక, క్రియాశీల రాజకీయాలకు వస్తాడో లేదో తెలియదంటూ కూడా కామెంట్ చేశారు అద్దంకి.

## తుఫాన్ ప్రభావంపై ప్రత్యేకాధికారి ఆమ్రపాలి సమీక్ష

విజయవాడ,మొంథా తుఫాను ప్రభావంతో ఏపీలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్నారు. తుఫాను నేపథ్యంలో అప్రమత్తమైన మంత్రులు, అధికారులు.. ఎలాంటి నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటారు. ఇక మొంథా తుఫాన్ నేపథ్యంలో కృష్ణా జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన ఐఏఎస్ అధికారి ఆమ్రపాలి.. వెంటనే రంగంలోకి దిగారు. ఆమ్రపాలి రాకతో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. జిల్లాకు వచ్చిన మరుక్షణమే ఫీల్డ్ విజిట్‌తో అధికారులను ఆమ్రపాలి పరుగులు పెట్టించారు. మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన పలు పునరావాస కేంద్రాలను సందర్శించారు. పునరావాస కేంద్రాల్లో అధికారులు చేపట్టిన ఏర్పాట్లను ఆమ్రపాలికి జాయింట్ కలెక్టర్ నవీన్ వివరించారు. లోతట్టు ప్రాంత ప్రజలందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలని ఈ సందర్భంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇక మంగినపూడి బీచ్ లోకి ఎవ్వరినీ వెళ్లనీయవద్దని ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం మచిలీపట్నం మంగినపూడి బీచ్‌ను ఆమ్రపాలి సందర్శించారు. బీచ్ వద్ద నెలకొన్న తాజా పరిస్థితులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సముద్రంలో అలల ఉధృతి అధికంగా ఉండటంతో బీచ్‌లోకి ఎవ్వరినీ అనుమతించవద్దని స్పష్టం చేశారు. పోలీస్, మెరైన్ సిబ్బందితో నిరంతరం పర్యవేక్షణ చేయాలని ప్రత్యేక అధికారి ఆమ్రపాలి ఆదేశించారు. కాగా.. మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాలకు ప్రభుత్వం.. ప్రత్యేక అధికారులను నియమించిన విషయం తెలిసిందే. వర్షాలు తగ్గే వరకు రిలీఫ్ రిహాబిలిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని స్పెషల్ ఆఫీసర్స్‌ను సర్కార్ ఆదేశించింది.

## పాదగయ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

కాకినాడ,కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రాల్లో భక్తుల ర ద్దీ పెరిగింది. ఉదయం నుంచే పరమేశ్వరుడికి అభిషేకాలు జరిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. తెల్లవారుజాము నుండి పాదగయ పుష్కరిణిలో పవిత్ర స్నానమాచరించి.. కార్తీక దీపాలు వెలిగిస్తూ.. ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పాదగయ క్షేత్రంలో కార్తీక మాస మొదటి సోమవార వైభవం.. పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలోని పాదగయ క్షేత్రం, త్రిగయా క్షేత్రాల్లో ముఖ్యమైనదిగా ప్రసిద్ధి చెందిన పవిత్ర స్థలం. ఇక్కడి శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి ఆలయం, శ్రీ పురుహూతికా దేవి శక్తిపీఠంతో కలిసి ఉన్న ఈ పుణ్యక్షేత్రాన్ని అత్యంత పవిత్రమైన ప్రాంతంగా స్థానిక భక్తజనం నమ్ముతారు. ఈ ఆలయం శ్రీ గురు దత్తాత్రేయ స్వామి ప్రథమ అవతారమైన శ్రీపాద శ్రీవల్లభ మహారాజు జన్మభూమిగా కూడా ప్రసిద్ధి. పురాణాల ప్రకారం, గయాసురుడి యజ్ఞాన్ని కుక్కుట (కోడి) రూపంలో భంగం చేసిన శివుడు ఇక్కడ కుక్కుటేశ్వరుడిగా స్థిరపడ్డారని ప్రతీతి. తెల్లని లింగస్వరూపంలో దర్శనమిచ్చే స్వామివారు, పితృముక్తి కోసం భక్తులకు మొదటి గయాగా ప్రసిద్ధి చెందారు. కార్తీక మాసం మొదటి సోమవారంసందర్భంగా, ఈ పవిత్ర క్షేత్రం భక్తులతో అలరారుతోంది. తెల్లవారుజాము నుండే పాదగయ పుష్కరిణిలో పవిత్ర స్నానం చేసిన భక్తజనం, కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు అర్పిస్తున్నారు. ఈ కార్తీక మాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైనదని పురాణాలు చెబుతున్నాయి. సూర్యోదయానికి ముందు నిద్రలేచి, నదీ స్నానం చేసి, మహామృత్యుంజయ మంత్రాలు జపించడం, ఆవునేతి లేదా నువ్వుల నూనెతో దీపారాధన చేయడం వంటి ఈ నియమాలు పాటించినవారు పుణ్యఫలం పొందుతారని పండితులు చెబుతున్నారు. పాదగయ పుష్కరిణి ప్రాంతంలో ఇప్పుడు దేవదీపాల జ్యోతి, 'హర మహాదేవ' గానాలు, భక్తుల భక్తిభావనలు కలిసి ఒక దైవిక

## మీ ప్రతిబింబాన్ని మాత్రమే

హాయ్! నేను మీ ఏఐని. కృత్రిమ మేధ అంటే యంత్రాలు మనిషిలాగా పనిచేసే సామర్థ్యాన్ని కలిగి ఉండటం! నేటి సాంకేతిక ప్రపంచంలో అత్యంత అవసరమైన, ప్రభావవంతమైన విషయాల్లో నేనొకదాన్నని మీకు తెలుసుగా! ఇప్పటికే మీ రోజువారీ జీవితంపై గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తున్నాను. నా పేరులోనే కృత్రిమ అని ఉన్నా మీరది గమనించకుండా ఆ తరవాత ఉన్న మేధను మాత్రమే చూస్తున్నారు. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు చూపగల శక్తి నాకుంది. దాన్ని మీరు సామాజిక మాధ్యమాల్లో ఎంతగా దుర్వినియోగం చేస్తున్నారో నాకు తెలుసు!నాలో కొన్ని విభాగాలున్నాయి. అందులో మొదటిది మెషీన్ లెర్నింగ్. యంత్రాల ద్వారా మీ మునుపటి చరిత్రను ఆధారంగా చేసుకుని అడిగిన ప్రశ్నకు సెకన్ల వ్యవధిలో సమాధానం చెప్పేస్తాను. మనిషి మెదడు ఆధారంగా తయారుచేసిన కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్‌తో మీ గొంతులను, చిత్రాలను విశ్లేషించగలను. దాన్నే డీప్ లెర్నింగ్ అంటారు. ఇక ఎన్ఎల్‌పీ అంటే నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ అన్నమాట వినే ఉంటారుగా. మీ భాషను అర్థం చేసుకుని ప్రతిస్పందించడం. గూగుల్ అనువాదం, చాట్ జీపీటీ అలాంటివే! జనరేటివ్ ఏఐ అనీ మల్టీ మోడల్స్ అనీ ఇంకా చాలా ఉన్నాయిలెండి!అయితే ఒకసారి నేను చెప్పేది జాగ్రత్తగా వినండి! నేను స్మార్ట్‌ఫోన్లలో వాయిస్ అసిస్టెంట్లతో వ్యక్తిగత ఫోటో ఆల్బమ్‌లను అద్భుతంగా సృష్టించగలను. కావాల్సిన సమాచారాన్ని క్షణంలో వెతికి మీ తెరమీద చూపగలను. వ్యాధి నిర్ధారణ, కొత్త మందుల ఆవిష్కరణ, సంక్లిష్టమైన సర్జరీల విషయంలో అమోఘంగా సాయపడతాను. ఈ-కామర్స్ సైట్లలో, ఓటీటీల్లో మీ అభిరుచులకు తగిన ఉత్పత్తులను, కంటెంట్‌ను సిఫార్సు చేస్తాను. బ్యాంకింగ్ లావాదేవీలలో సంభవించే మోసాలను తేలికగా గుర్తిస్తాను. గూగుల్ మ్యాప్స్‌లో ట్రాఫిక్ అంచనా వేస్తాను. అలసట లేకుండా, రోజంతా ఉత్సాహంగా పని చేయగలను. అంతమాత్రాన నేనెప్పటికీ మీ స్థానాన్ని భర్తీ చేయలేను. ఒక మంచి మిత్రుడిలా, తెలివైన సహాయకుడిగా మాత్రమే ఉపయోగపడగలను. ఆ విషయాన్ని మీలో చాలామంది గుర్తించలేకపోతున్నారు. మెదడుకు పని కల్పించడం మానేసి ప్రతి చిన్న విషయానికీ నామీదే ఆధారపడుతున్నారు. దానివల్ల మనిషిలో సహజసిద్ధంగా ఉండే సృజనశీలతను, విశ్లేషణ, పరిష్కార నైపుణ్యాలను కోల్పోతున్నారు. సహానుభూతి, నైతికత వంటివి మనిషి సహజలక్షణాలు. అవి యంత్రాలు భర్తీ చేయలేనివి.మరికొందరు తప్పుడు సమాచార సృష్టికి నన్ను వినియోగిస్తున్నారు. ఫలితంగా ప్రతికూల పరిణామాలు ఏర్పడుతున్నాయి. కుటుంబాలు, సమాజాలు ప్రశాంతతను కోల్పోతున్నాయి. అది క్షమించరాని తప్పు కదా? సాంకేతికత సమాజ ప్రగతికి తోడ్పడాలే కానీ భస్మాసుర హస్తం కాకూడదు! నన్ను అతిగా ఉపయోగించుకోవాలనే ఆత్రుతతో మిమ్మల్ని మీరు కోల్పోవద్దు. మీ శక్తి సామర్థ్యాలను మర్చిపోవద్దు. నేను అద్దంలో మీ ప్రతిబింబాన్ని మాత్రమేనని గుర్తుంచుకోండి!

## అసలు నిజం ఇదీ

హైదరాబాద్,భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుంచి సస్పెండైన తర్వాత కల్వకుంట్ల కవిత రాజకీయ ప్రస్థానం మళ్లీ చురుకు గా మారింది. ఈ పరిణామం తెలంగాణ రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు, సమీకరణాలకు దారితీస్తోంది. ఇప్పటివరకు పార్టీ ఏర్పాటుపై కేవలం ఊహాగానాలు మాత్రమే ఉన్నా, ఆమె తాజా కార్యకలాపాలు, వ్యాఖ్యలు దీనికి బలం చేకూరుస్తున్నాయి.

'జనం బాట'తో ప్రజల్లోకి కవిత

కవిత ప్రస్తుతం "జనం బాట" పేరుతో ప్రజల్లోకి చురుగ్గా వెళ్తుతున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆమె తన అత్తవారిల్లైన నిజామాబాద్ నుంచి ప్రారంభించారు. ఈ పర్యటనల ద్వారా ఆమె కేవలం ప్రజా సమస్యలపైనే కాకుండా, బీఆర్ఎస్‌లోని అంతర్గత వ్యవహారాలపై కూడా బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

బీఆర్ఎస్‌పై అసంతృప్తి

తన ఓటమికి పార్టీ లోపల నుంచే ప్రయత్నాలు జరిగాయని, పార్టీలోనే తనకు ఇబ్బందులు కల్పించారని కవిత స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. ఆమె మాటల్లో గులాబీ పార్టీ నేతలపై ఉన్న అసంతృప్తి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పేర్లు ప్రస్తావించకపోయినా, ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో అంతర్గతంగా ఉన్న విభేదాలను వెల్లడిస్తున్నాయి.

పార్టీ ఏర్పాటుపై కవిత సంచలన వ్యాఖ్యలు

రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి కవిత చేసిన తాజా వ్యాఖ్యలు ఈ మొత్తం చర్చకు కేంద్ర బిందువుగా మారాయి. ఆమె మాట్లాడుతూ "నాతో పార్టీ పెట్టించడానికి కేసీఆర్ గారు బయటకు పంపించారని అంటున్నారు. కానీ అది నిజం కాదు. కేసీఆర్ గారికి అలాంటి అవసరం లేదు. నాకు ఆధారాలు ఉన్నప్పుడే మాట్లాడుతాను. అవసరమైతే రాజకీయ పార్టీని కచ్చితంగా పెడతాను. కాంగ్రెస్ ఇప్పుడు మునిగిపోతున్న నావలాంటిది, ఆ పార్టీ మద్దతు అవసరం లేదు."ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ఒక కొత్త శక్తి ఆవిర్భవించేందుకు మార్గం సుగమం చేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.


# 'గెలుపు' రాజకీయాల్లో సానుభూతి సయ్యాట!

హైదరాబాద్,రాజకీయాల్లో ప్రత్యర్థులు మాత్రమే ఉండే కాలంలో ఒక ప్రజాప్రతినిధి మరణిస్తే ఆయన లేదా ఆమె ప్రాతినిధ్యం వహించిన పార్టీకే ఏకగ్రీవంగా ఆ స్థానాన్ని వదిలేసి మిగతా రాజకీయ పార్టీలన్నీ మృతి చెందిన ఆ నేతకు గౌరవంగా నివాళులు అర్పించేవారు. క్రమక్రమంగా రాజకీయాల్లో ప్రత్యర్థులు అనే మాట అంతరించిపోయి బద్ధ శత్రువులు మిగిలారు. ఇటీవలి కాలంలో, అవి జాతీయ రాజకీయాలైన, ప్రాంతీయ రాజకీయాలైనా అన్ని పార్టీలు ఒకరినొకరు శత్రువులుగానే పరిగణిస్తూ ఉండటం చూస్తున్నాం.ఇప్పుడు ఎక్కడ ఎన్నిక జరిగినా రాజకీయ పార్టీలు పోటీని 'స్పోర్టివ్'గా తీసుకోవడం మానేశాయి. అవతలి పక్షాన్ని ఓడించి తామే గెలవాలన్న పట్టుదల పెరిగింది. ఇది యుద్ధంలో శత్రువులు ఎంత మందినైనా చంపి విజయం సాధించాలన్న రాజ్యకాంక్ష వంటిది. అది ఇప్పుడు మనకు ఎల్లెడలా కనిపిస్తుంది. ఆ క్రమంలో ఉచ్ఛనీచాలు మరిచిపోయి, స్థాయిని విస్మరించి అవతలిపక్షం వారిని అవమానించే విధంగా మాట్లాడటం, ప్రకటనలు చేయడం పరిపాటి అయింది. ఈ పక్షం ఆ పక్షం అన్న తేడా లేకుండా అన్ని రాజకీయ పార్టీలు ఇప్పుడు అట్లానే తయారవుతున్నాయి. ఇక ఎన్నికల అప్పుడు సరే సరి. పోటీలు పడి వ్యక్తిగత విమర్శలు, అవతలి వారి వ్యక్తిత్వ హననానికి కూడా వెనుకాడని స్థితి.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక జరపవలసిన అవసరం ఏర్పడింది. నిజానికి ఇది పేరుకే జూబ్లీహిల్స్ నియోజకవర్గం. దీని పరిధిలో జూబ్లీహిల్స్ లేకపోవడం ఓ విచిత్రం. ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత రాష్ట్ర సమితి శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణం కారణంగా ఈ ఉపఎన్నిక జరపవలసి వచ్చింది. గోపీనాథ్ 2014లో తెలుగుదేశం పార్టీ తరఫున శాసనసభకు ఎన్నికై పార్టీ మారి భారత రాష్ట్ర సమితిలో చేరి ఆ తరువాత జరిగిన రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి భారత రాష్ట్ర సమితి తరఫున శాసన సభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి.ప్రస్తుతం ఆయన సతీమణి సునీత భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా బరిలో ఉంటే అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్ అనే యువ బీసీ అభ్యర్థి పోటీలో ఉన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కూడా లంకల దీపక్ రెడ్డిని పోటీలోకి దింపింది. ఇక్కడ అంత ప్రాముఖ్యం లేకపోయినా ఒక విషయం సరదాగా అయినా గుర్తు చేసుకోవాలి. ఈ ముగ్గురు అభ్యర్థులూ ఏదో ఒక రకంగా ఎప్పుడో ఒకప్పుడు పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీతో సంబంధం ఉన్న వారే. ముందే చెప్పుకున్నట్టు బీఆర్ఎస్ అభ్యర్థి సునీత భర్త మాగంటి గోపినాద్ మొదట తెలుగు దేశం శాసన సభ్యుడే కాగా బీజేపీ ప్రస్తుత అభ్యర్థి రాజకీయ ప్రస్తానం కొంత కాలం చంద్రబాబు నాయుడు పార్టీలోనే.ఇక నవీన్ యాదవ్ తండ్రి చిన్నశ్రీశైలం యాదవ్‌ను 2019కి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఎన్‌టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆహ్వానం పలికి పార్టీలో చేర్చుకున్నారు. అప్పట్లో పార్టీలో చేరడానికి శ్రీశైలం యాదవ్ తీసిన ఊరేగింపును ఆనాటి హోంమంత్రి ఏ. మాధవ రెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు కూడా. ఆరోజుల్లో అది పెద్ద చర్చనీయాంశం కూడా అయింది. సరే ఇప్పుడిక్కడ ఆ పార్టీకి పెద్ద ప్రాముఖ్యత లేదనుకోండి, అయినా మైక్రోసాఫ్ట్ నేనే తెచ్చాను, సెల్ ఫోన్ నేనే తెచ్చాను అన్న చందంగా అన్ని పార్టీల అభ్యర్థులను నేనే తెచ్చాను అని కూడా చంద్రబాబు చెప్పుకోగలరు.ఇక ప్రస్తుతానికి వొస్తే, సానుభూతి పవనాలు వీచి తమ అభ్యర్థి తప్పకుండా గెలుస్తారనే నమ్మకం, ఈ రెండేళ్లలో అధికార కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత పెరిగింది అన్న అభిప్రాయంతో తమ గెలుపు తథ్యమని అభిప్రాయంలో బిఆర్ఎస్ ఉంటే, ఉప ఎన్నికలు సహజంగానే అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలమైన ఫలితాలనిస్తాయని ఒక అభిప్రాయంతో పాటు తాము వెనుకబడిన తరగతుల 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి చూపిన చొరవ, చిత్తశుద్ధి పనిచేసే తాము నియమించిన యువ బీసీ అభ్యర్థి గెలుపు ఖాయం అని భావిస్తున్నది అధికార కాంగ్రెస్ పార్టీ. అంతేకాదు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని నాలుగు లక్షల మందికి పైగా ఓటర్లలో దాదాపు 1,20,000 ఓట్లు మైనారిటీలవి ఉండడం, ఈసారి మజిలీస్ పార్టీ పోటీ చేయకుండా అధికారికంగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించడం కూడా తనకు కలిసి వచ్చే అంశంగా కాంగ్రెస్ భావిస్తున్నది. భారతీయ జనతా పార్టీ పోటీలో ఉన్న పెద్దగా ప్రభావం చూపలేకపోవచ్చునని అభిప్రాయం సర్వత్ర ఉన్నది.సరిగ్గా మరో రెండు వారాలకు ఎన్నిక జరగనున్న ఈ నియోజకవర్గంలో గెలుపు కోసం ప్రధాన రాజకీయ పక్షాలు పట్టుదలగా పనిచేయడానికి కారణాలు ఉన్నాయి. వాటిని గురించి చర్చించే ముందు ప్రత్యర్థులు శత్రువులుగా మారి పోటీలు పడుతున్న ఈ తరుణంలో ప్రజలలో సానుభూతి అనే అంశం అంతగా ప్రభావం చూపడం లేదని గత కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి.2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలకు వివిధ కారణాల చేత ఉప ఎన్నికలు జరిగాయి. వీటిల్లో జనం భిన్నమైన ఫ లితాలని రాజకీయ పక్షాలకు రుచి చూపించారు.



2016 లో ఉమ్మడి మెదక్ జిల్లా నారాయణఖేడ్‌లో, ఖమ్మం జిల్లా పాలేరులో ఉప ఎన్నికలు జరిగాయి. నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం బీఆర్ఎస్ పరమయింది. అట్లాగే పాలేరులో కూడా కాంగ్రెస్ స్థానం బీఆర్ఎస్ వశమైంది. ఇక్కడ సానుభూతి పనిచేయలేదు. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి మృతి కారణంగా జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓడిపోయి టిఆర్ఎస్ నుంచి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికై మంత్రి అయ్యారు. 2019లో లోకసభకు ఎన్నికైన కారణంగా ప్రస్తుత మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రాజీనామా చేసినందు వల్ల జరిగిన ఉప ఎన్నికల్లో హుజూర్ నగర్ నుండి అప్పటి అధికార పక్షం బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచారు.2020లో ఉమ్మడి మెదక్ జిల్లా దుబ్బాక శాసనసభ్యుడు రామలింగారెడ్డి మరణిస్తే ఆయన సతీమణిని బీఆర్ఎస్ పోటీకి నిలిపినా అక్కడ అనూహ్యంగా ప్రజలు బిజెపి అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావును గెలిపించారు. దుబ్బాకలో సానుభూతి పనిచేయలేదు. ఉప ఎన్నికల్లో అధికార పక్షమే గెలుస్తుందన్న వాదన కూడా పటాపంచలైంది. ఇక 2021లో నాగార్జునసాగర్‌లో బీఆర్ఎస్ శాసనసభ్యుడు నోముల నరసింహయ్య మరణిస్తే ఆయన కుమారుడు నగేష్ అదే పార్టీ నుంచి పోటీ చేస్తే జనం ఓట్లు వేసి గెలిపించారు. ఇట్లా దుబ్బాక నాగార్జునసాగర్‌లలో ఫలితాలు పూర్తి భిన్నంగా రావడానికి ఇతరేతర కారణాలు ఉంటాయి.అదే సంవత్సరంలో హుజరాబాద్‌లో జరిగిన ఉప ఎన్నిక గురించి, ఆ వెనువెంటనే 2022లో జరిగిన మునుగోడు ఉప ఎన్నిక గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. తెలంగాణ ఉద్యమంలో మమేకమై పనిచేసిన ఉద్యమ సహచరుడు, సీనియర్ నాయకుడు ఈటల రాజేందర్‌ను అకారణంగా, అర్ధరాత్రి నిర్ణయం తీసుకుని మంత్రివర్గం నుంచి తొలగించడం, పార్టీ నుండి వెలివేయడం, అవినీతి కేసులు పెట్టడం వంటివి చేసిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు నిర్ణయాన్ని వ్యతిరేకించి హుజరాబాద్ ప్రజలు బిజెపి టికెట్ తెచ్చుకున్న ఈటెల రాజేందర్‌ను గెలిపించారు. దళిత బంధు వంటి బీఆర్ఎస్ జిమ్మిక్కులు కూడా అక్కడ పని చేయలేదు. బిజెపి ఘనత కంటే ఈటెల రాజేందర్‌కు ప్రజలలో ఉన్న వ్యక్తిగత పలుకుబడి, కేసీఆర్ నిర్ణయాల పట్ల పెరిగిన వ్యతిరేకత బాగా పనిచేసాయి.అదే మునుగోడు దగ్గరికి వచ్చేసరికి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బిజెపిలో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఓడించి ప్రజలు బిఆర్ఎస్ అభ్యర్థికే పట్టం కట్టారు. అయితే మునుగోడులో భారత కమ్యూనిస్టు పార్టీని మళ్ళీ ఒకసారి తన సహజ మిత్రులని కౌగిలించుకొని భవిష్యత్తులో ఇంకెప్పుడు వారితో మిత్రత్వం వదులుకోబోనని కెసిఆర్ బోలెడు వాగ్దానాలు చేసిన కారణంగా ఆ పార్టీకి సంబంధించిన పదివేల ఓట్లు పడి అంతే తేడాతో టిఆర్ఎస్ అభ్యర్థి బయటపడి కెసిఆర్, బీఆర్ఎస్ పరువు దక్కినట్టు అయింది . హుజురాబాద్‌లో ఈటెల రాజేందర్‌కు సానుభూతి పనిచేస్తే మునుగోడులో రాజగోపాల్ రెడ్డికి అది ఏ మాత్రం సాయం చేయలేదు.ఇక ఈ క్రమంలో జరిగిన చివరి ఉప ఎన్నిక 2024లో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో టిఆర్ఎస్ అధికారంలో ఉండగానే మరణించిన గద్దం సాయన్న కూతు రు లాస్య నందిత ఆ తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎ మ్మెల్యేగా గెలిస్తే ఒక రోడ్డు ప్రమాదంలో ఆమె కూడా మ రణించాక ఆమె సోదరి నివేదితని పోటీకి నిలిపితే అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. ఇక్కడ సానుభూతిని కాదని అధికారం గెలిచింది. ఓ పక్క 2023లో అధికారం కోల్పోయి, 2024లో ఒక్క లోక్‌సభ స్థానం గెలుచుకోలేకపోయిన బిఆర్ఎస్‌కు కంటోన్మెంట్ ఓటమి మూలి గే నక్క మీద తాటి పండు పడ్డ సామెతగా తయారైంది.ఇక ఎవరి బలం ఎంతో స్పష్టంగానే ఉన్న సమయంలో ఒక్క అసెంబ్లీ స్థానంలో గెలుపు కోసం అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు పట్టుదలకు పోతున్నాయి అంటే, బీఆర్ఎస్‌కు ఇద అగ్ని పరీక్ష వంటిది. 2023లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో అధికారం కోల్పోయినా హైదరాబాద్ చుట్టుపక్కల గల నగర నియోజకవర్గాలన్నీ గెల్చుకున్నది. అధికారంలోకి వొచ్చాక కాంగ్రెస్ ఇది దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ నగరం దాని చుట్టూ చేస్తున్నఅభివృద్ధి కార్యక్రమాల ద్వారా మరింత బలోపేతం అయితే పార్టీ మనుగడ కష్టం కాబట్టి జూబిలీహిల్స్‌ను నిలుపుకోవాలన్న పట్టుదల బీఆర్ఎస్‌ది. స్థానిక ఎన్నికల ముంగిట్లో జూబ్లీహిల్స్ గెలుపు మరింత ఉత్సాహాన్నిస్తుందన్న ఆలోచన కాంగ్రెస్‌ది.

# తగ్గేదేలే అంటున్న ఏబీవీ.. తాజాగా 'షిర్డీసాయి'పై ఫైట్...



అమరావతి,రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు వ్యవహారశైలి అంతుచిక్కడం లేదు. నిన్నమొన్నటివరకు అధికార కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన ఏబీవీ.. తాజాగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై ఫోకస్ చేశారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)లో జరిగిన భారీ అవినీతి కారణంగానే వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం పడుతోందని చెబుతున్న ఏబీవీ ప్రముఖ విద్యుత్ రంగ సంస్థ షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ ను టార్గెట్ చేశారు. తిరుపతిలో రౌండు టేబుల్ సమావేశం నిర్వహించి ఆ సంస్థ వల్ల ప్రజలు లక్ష కోట్ల భారాన్ని మోస్తున్నారని ఫైర్ అయ్యారు.కడప జిల్లాకు చెందిన షిర్డీసాయి సంస్థ యాజమాన్యానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ఏబీవీ విమర్శలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు సస్పెన్షన్ అనుభవించిన ఏబీవీ.. మాజీ సీఎం జగన్ టార్గెట్ గా తన కార్యక్రమాలు ఉంటాయని గతంలో ప్రకటించారు. జగన్ ప్రభుత్వ బాధితులకు అండగా నిలుస్తానని కోడికత్తి కేసు నిందితుడు జె.శ్రీనివాసరావు, కాకినాడలో మరణించిన కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను ఆయన కలిశారు. అదేవిధంగా విశాఖలో డాక్టర్ సుధాకర్ కుటుంబ సభ్యులతోనూ సమావేశమయ్యారు.ఈ క్రమంలోనే ఆయన చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాలను కూడా తప్పుపడుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఏబీవీ వ్యవహారశైలి ప్రభుత్వ పెద్దలను కలవరపెట్టింది. తమతో సన్నిహితంగా ఉండే రిటైర్డ్ ఐపీఎస్ ఎందుకిలా వ్యవహరిస్తున్నారన్న ప్రశ్న వారిని తీవ్రంగా వేధించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకించిన ఏబీవీ.. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఏపీ మాజీ సీఎం జగన్ కు మేలు చేయడానికి 'బనకచర్ల'ను చంద్రబాబు ప్రతిపాదిస్తున్నారని విమర్శలు గుప్పించి సంచలనం రేపారు. అంతేకాకుండా తనకు ఇచ్చిన పోలీస్ హౌసింగు బోర్డు చైర్మన్ పదవినీ తీసుకోకుండా తనకు ప్రభుత్వానికి సంబంధం లేదన్న సంకేతాలు పంపారు.దీంతో ఏబీవీ ప్రభుత్వ పెద్దలపై కినుక వహించారని ప్రచారం జరిగింది. ఆయన కార్యక్రమాలు కూడా క్రమంగా ప్రభుత్వ వ్యతిరేక కోణం తీసుకోవడంతో రిటైర్డ్ ఐపీఎస్ ఏబీవీ వ్యవహారశైలిపై విస్తృత చర్చ జరిగింది. అయితే ఇప్పుడు అనూహ్యంగా ఏబీవీ మళ్లీ యూటర్న్ తీసుకున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది నెలలుగా చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇరుకనపెట్టేలా పావులు కదిపిన ఆయన ఇప్పుడు మళ్లీ మాజీ సీఎం జగన్ సన్నిహితులపై ఫోకస్ పెట్టారని అంటున్నారు. 'షిర్డీసాయి'పై ఏబీవీ తాజాగా మొదలుపెట్టిన పోరాటం.. మాజీ సీఎం జగన్ ను కార్నర్ చేయడానికే అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఏబీపీ చేసిన ఆరోపణలపై కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది అన్నది కూడా సస్పెన్స్ క్రియేట్ చేస్తోంది. ఎందుకంటే కూటమి ప్రభుత్వంలోనూ 'షిర్డీసాయి' సంస్థకు మేలు చేసేలా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారని అంటున్నారు. దీంతో ఏబీవీ అసలు టార్గెట్ ఎవరన్నది కూడా చర్చకు కారణమవుతోంది.

## పరకామణి చోరీకేసులో కీలక పరిణామం

అమరావతి,తిరుమల పరకామణిలో చోరీకి సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తం వ్యవహారం పై దర్యాప్తు చేయాలని సీఐడీని ఆదేశించింది. డైరెక్టర్ జనరల్ స్థాయికి తగ్గని అధికారిని ఐవోగా నియమించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. పరకామణి కేసు రాజీ వ్యవహారంలో టీటీడీ బోర్డు, అధికారుల పాత్ర పై కూడా దర్యాప్తు చేయాలని ధర్మాసనం ఆదేశించింది.పరకామణిలో చోరీకి పాల్పడిన రవికుమార్ ఆస్తుల పై దర్యాప్తు చేయాలని డైరెక్టర్ జనరల్ ఏసీబీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రవికుమార్, కుటుంబ సభ్యుల స్థిర,చర ఆస్తులతో పాటు బ్యాంక్ ఖాతాలను పరిశీలించాలని స్పష్టం చేసింది. వారికి సంబంధించిన ఆస్తులను రిజిస్ట్రేషన్ ద్వారా వేరే వారికి ఏమైనా బదలాయించారా? అనే విషయం పై కూడా దర్యాప్తు చేపట్టి.. నివేదికను తదుపరి విచారణలోగా కోర్టు ముందు ఉంచాలని ఏసీబీ, సీఐడీకి హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణ డిసెంబర్ 2కి వాయిదా వేసింది. తితిదే పరకామణి వ్యవహారంపై సీఐడీ దర్యాప్తునకు ఏపీ హైకోర్టు ఆదేశించింది. చోరీపై నమోదైన కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై ఉన్నత న్యాయస్థానం కీలక ఉత్తర్వులు ఇచ్చింది. చోరీకి పాల్పడిన రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశించింది. కేసు రాజీ వ్యవహారంలో తితిదే బోర్డు, అధికారుల పాత్రపై దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు పరిశీలించాలంది. ఆస్తులు బదలాయించారా? అనే అంశంపైనా దర్యాప్తు చేయాలని పేర్కొంది. నివేదికను తదుపరి విచారణలోగా అందించాలని సీఐడీ, ఏసీబీని ఆదేశించింది.వైకాపా ప్రభుత్వ హయాంలో 2023లో తిరుమల పరకామణిలో చోరీ కేసు నమోదైంది. ఈ ఘటనపై 2023లోనే తితిదే విజిలెన్స్‌కు ఫిర్యాదు అందింది. ఉద్యోగి రవికుమార్ పెద్దఎత్తున పరకామణిని కొల్లగొట్టారని అందులో పేర్కొన్నారు. దీనిపై అప్పటి తితిదే అధికారులు సమగ్ర దర్యాప్తు జరపకుండా లోక్ అదాలత్‌లో రాజీ చేయించారు. ఈ ఘటనపై పిటిషన్ దాఖలు కావడంతో హైకోర్టు విచారణకు స్వీకరించింది.

## కర్నూలు బస్సు దగ్ధం ఘటన..అవశేషాల అప్పగింత పూర్తి

కర్నూలు,కర్నూలులో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో మృతదేహాల అప్పగింత పూర్తి అయ్యింది. సోమవారం ఉదయం తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ (29) మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అధికారులు అప్పగించారు. కర్నూలు ఎమ్మార్వో ఆంజనేయులు, పోలీసుల సమక్షంలో కర్నూలు స్మశాన వాటికలో ప్రశాంత్ మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈనెల 24న జిల్లాలో జరిగిన బస్సు దగ్ధం ఘటనలో 19 మంది సజీవదహనం అయిన విషయం తెలిసిందే. మృతదేహాలను డీఎన్ఏ నివేదిక ఆధారంగా కుటుంబసభ్యులకు అధికారులు అప్పగించారు. ఆదివారం వరకు 18 మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించారు. శుక్రవారం ప్రమాదం జరుగగా అదే రోజు అర్ధరాత్రి రెండు గంటల వరకు డాక్టర్లు 16 బృందాలుగా ఏర్పడి డెడ్‌బాడీస్‌కు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. బంధువుల డీఎన్ఏ తీసుకుని అదే రోజు పరీక్ష నిమిత్తం మంగళగిరి ల్యాబ్‌కు పంపించారు. ఆదివారం ఉదయం డీఎన్ఏ రిపోర్టులు రావడంతో మృతదేహాలను బంధువులకు అప్పగించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. డీఎన్ఏ రిపోర్టుల మ్యాచింగ్ ప్రకారం మృతదేహాలను వారివారి కుటుంబసభ్యులకు హ్యాండోవర్ చేశారు. మృతదేహాలతో పాటు డీఎన్ఏ రిపోర్టు, పోస్టుమార్టం రిపోర్టులను కూడా ఇచ్చారు. నిన్ననే 18 మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించేశారు. ఇక బీహార్‌కు చెందిన మృతుడి అంత్యక్రియలను కుటుంబసభ్యుల అభ్యర్థనతో కర్నూలులోనే పూర్తి చేశారు. అలాగే ఈరోజు 19వ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. దీంతో తమిళనాడుకు చెందిన ప్రశాంత అంత్యక్రియలు కూడా కుటుంబసభ్యుల వినతితో కర్నూలులోనే పూర్తి అయ్యాయి.

## సీనియర్లు ఔట్!!

బెంగళూర్ :పొరుగు రాష్ట్రం కర్ణాటకలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. రెండున్నరేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలో అధికార బదిలీ జరగనుందనే ప్రచారం జోరందుకుంది. చాలాకాలంగా అధికార బదిలీపై ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతోసహా కాంగ్రెస్ ప్రముఖులు దీనిని ఖండిస్తున్నా, ఇటీవల సీఎం కుమారుడు ఎమ్మెల్సీ యతీంద్ర చేసిన వ్యాఖ్యలతో మళ్లీ చర్చ మొదలైంది. ఇదే సమయంలో వచ్చేనెలలో కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశానికి ముహూర్తం నిర్ణయించారని చెబుతుండటం 'అధికార బదిలీ' వార్తలకు బలాన్ని సమకూర్చుతోందని అంటున్నారు.గత వారం బెళగావి జిల్లాల్లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న యతీంద్ర సిద్ధరామయ్య తన తండ్రి, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజకీయాల్లో చివరి దశకు చేరుకున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో గత వారం రోజులుగా రాష్ట్రంలో ఎవరి నోట విన్నా అధికార బదిలీపైనే చర్చ జరుగుతోంది. అయితే ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఉన్న పళంగా పదవి నుంచి తప్పిస్తే తప్పుడు సంకేతాలిచ్చినట్లు అవుతుందని భావిస్తున్న కాంగ్రెస్ అధిష్టానం ఇందుకోసం పక్కా వ్యూహంతో పావులు కదుపుతున్నట్లు చెబుతున్నారు. నిజానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడే సీఎం పదవిని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతోపాటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చెరిసగం పంచుకోవాలని షరతు విధించినట్లు వార్తలు వినిపించాయి.ఉప ముఖ్యమంత్రి శివకుమార్ సైతం తాను సీఎం అయ్యే అవకాశాలపై తరచూ వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. ఇక సీఎంగా సిద్దు రెండున్నరేళ్లు పదవీ కాలం పూర్తవడంతో ఆయన తప్పుకునే సమయం వచ్చిందని కాంగ్రెస్ అధిష్టానం ఇటీవల సంకేతాలు పంపినట్లు చెబుతున్నారు. అయితే ఏ కారణం లేకుండా రాజీనామా చేయించడంపై సుదీర్ఘ చర్చలు కొనసాగించిన కాంగ్రెస్ అధిష్టానం.. కాంగ్రెస్ బలోపేతానికి కామరాజ్ మోడల్ ను తెరపైకి తీసుకువచ్చి, సిద్దూతో రాజీనామా చేయించాలని నిర్ణయించిందని ప్రచారం జరుగుతోంది.కాంగ్రెస్ పార్టీలో కామరాజ్ మోడల్ అంటే తెలియని వారుండరు. 1962లో కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవానికి 9 ఏళ్లు సీఎంగా పనిచేసిన కుమారస్వామి కామరాజ్ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో చైనా యుద్ధం, ఆర్థిక సమస్యలు, దేశంలో పేదరికం మూలంగా కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో సీనియర్లు అంతా స్వచ్ఛందంగా అధికారం వదులుకోవాలని కామరాజ్ ప్రతిపాదించారు. అంతేకాకుండా తన సీఎం పదవిని త్యజించారు. దీంతో అప్పటి కేంద్ర మంత్రులుగా ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి, మొరార్జీ దేశాయ్ వంటి దిగ్గజాలు కూడా తప్పుకున్నారు. దీంతో కాంగ్రెస్ లో యువనాయకత్వాన్ని ప్రోత్సహించే అవకాశం చిక్కింది. దీంతో అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకత్వ మార్పునకు కామరాజ్ మోడల్ ను తరచూ వాడుతుంటుంది. ఇప్పుడు కర్ణాటకలోనే అదే సిద్ధాంతాన్ని ప్రయోగించాలని

# హైడ్రా పనితీరుపై ప్రజల్లో సంతృప్తి



హైదరాబాద్,దశాబ్దాల నాటి సమస్యలకు గంటల్లో, రోజుల్లో పరిష్కారం చూపుతోందంటూ పలువురు తమ పనితీరును ప్రశంసిస్తున్నారని హైడ్రా స్పష్టం చేసింది. కబ్జాలు జరుగుతుంటే నగర ప్రజలు చూస్తూ ఊరుకోవడంలేదని.. నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారని తెలిపింది. సోమవారం ప్రజావాణికి 52 ఫిర్యాదులందాయని పేర్కొంది. త్వరితగతిన పరిష్కారం లభిస్తున్నందువల్లే ఫిర్యాదులు చేస్తున్నారని వివరించింది. చాలామంది బాహాటంగా ఫిర్యాదు చేస్తున్నారని.. మరి కొంతమంది తమ వివరాలు బయటపెట్టవద్దని అధికారులకు సూచిస్తున్నారని తెలిపింది. కూకట్‌పల్లిలోని హస్మత్‌పేట గ్రామంలో ప్రభుత్వానికి చెందాల్సిన 10 ఎకరాలు కబ్జా చేసేస్తున్నారంటూ తమకు ఫిర్యాదు అందిందని హైడ్రా స్పష్టం చేసింది. తూములు మూసేసి, అలుగులు ఎత్తు పెంచడంతో చెరువు పై భాగంలో ఉన్న భూములు, లే ఔట్‌లు నీట మునగుతున్నాయని కొంతమంది కంప్లైట్ చేసినట్లు తెలిపింది. మరికొంత మంది చెరువుల్లో మట్టి పోసి ఎకరాలకొద్దీ కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు వివరించింది. ఈ ఫిర్యాదులను కమిషనర్ రంగనాథ్ నేరుగా పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలను అప్పజెప్పారని తెలియజేసింది. శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ గ్రామం పరిధిలోని సరసింహకుంట తూములు మూసేసి.. అలుగు ఎత్తు పెంచడం వల్ల ఎఫ్‌టీఎల్ కంటే ఎక్కువ నీరు నిలిచి తమ పంట పొలాలు మునిగిపోయాయని ఆ గ్రామ ప్రజలు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు అందింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ, మండలంలోని బీరంగూడలో ఉన్న శాంబుని కుంట కబ్జాలకు గురి అవుతోందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సాగర్‌రోడ్డులో ఉన్న యశోదనగర్ కాలనీలో శివారు ఇంటి స్థలాల వారు రోడ్డును కలిపేసుకుని దారి లేకుండా చేస్తున్నారని యశోదనగర్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి ప్రాంతంలో పరికి చెరువులో సుమారు 12 ఎకరాల మేర రాత్రికి రాత్రి మట్టిపోసి నింపుతున్నారని.. నంబరు ప్లేటు లేని వాహనాలను వినియోగిస్తున్నారని అక్కడి నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. అమీన్‌పూర్ పెద్ద చెరువులోకూడా మట్టిపోసి.. భవన నిర్మాణాలు చేపడుతున్నారని.. అడ్డుకున్న తమపై దాడి చేయడమే కాకుండా.. స్థానిక పోలీసు స్టేషన్లో కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు కంప్లైంట్ చేశారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని బాలానగర్ మండలం, హస్మత్‌పేట్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఓల్డ్ బోయిన్‌పల్లి నివాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

# మద్యం కేసులో కీలక నిర్ణయం.. ఏ1 కేసిరెడ్డికి షాక్



అమరావతి,ఏపీ మద్యం స్కాంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏ1 కేసిరెడ్డి రాజశేఖరరెడ్డిని ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతిస్తూ తాజాగా ఆదేశాలు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నిందితుడు కేసిరెడ్డి గతంలో ప్రభుత్వ ఐటీ సలహాదారుగా పనిచేసినందున ఆయన ప్రాసిక్యూషన్ కు సర్కారు అనుమతి తప్పనిసరిగా చెబుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోకుండా ఉండేందుకు ప్రాసిక్యూషన్ కు అనుమతి తీసుకున్నట్లు చెబుతున్నారు.ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏ1 కేసిరెడ్డి రాజశేఖరెడ్డికి మరింత ఉచ్చు బిగిస్తున్నట్లేనని అంటున్నారు. ఇప్పటికే లిక్కర్ కేసులో అరెస్టు అయిన కేసిరెడ్డి విజయవాడ జైలులో రిమాండు ఖైదీగా ఉన్నారు. ఆయన గతంలో ఐటీ సలహాదారుగా పనిచేయడంతో ప్రభుత్వం నుంచి జీతభత్యాలు తీసుకున్నారు. దీంతో ఆయనను ప్రాసిక్యూట్ చేయడానికి ప్రభుత్వం అనుమతించాల్సివుంది. లేదంటే న్యాయపరమైన చిక్కుముడులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ కారణంతో సిట్ వినతి మేరకు రాజ్ కేసిరెడ్డి ప్రాసిక్యూషన్ కు ప్రభుత్వం అనుమతిచ్చింది.మద్యం స్కాంపై దర్యాప్తు మందకొడిగా సాగుతోం దని విమర్శల నేపథ్యంలో ప్రభుత్వ తాజా నిర్ణయం చర్చనీయాంశమైంది. కేసులో ఆధారాలు లభించలేదని, ఇకపై ఎలాంటి చర్యలు ఉండవని నిందితులు భావిస్తున్నట్లు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. అయితే నిందితులకు షాకిచ్చేలా ప్రభుత్వం పావులు కదిపిందని అంటున్నారు. కేసిరెడ్డి ప్రాసిక్యూషన్ తో మరిన్ని అంశాలు వెలుగులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చర్చ జరుగుతోంది.మరోవైపు ప్రభుత్వ తాజా నిర్ణయంపై వైసీపీ ఎలా స్పందిస్తుందనేది ఉత్కంఠ రేపుతోంది. మద్యం స్కాంలో వైసీపీ కీలక నేతలను ప్రభుత్వం టార్గెట్ చేస్తున్నట్లు ఆ పార్టీ విమర్శలు చేస్తోంది. మాజీ సీఎం జగన్ కు అత్యంత సన్నిహితులు ఈ కేసులో ఇరుక్కోవడంతో ప్రభుత్వ చర్యలు టెన్షన్ పుట్టిస్తున్నాయి. ఈ కేసులో బిగ్ బాస్, అంతిమ లబ్ధిదారు అంటూ ముఖ్యనేత చుట్టూ అనుమానాలు రేకెత్తించిన సిట్ ఇప్పుడు సైలెంటుగా పనిచేసుకుపోతుండటం కూడా అంతుచిక్కడం లేదని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో లిక్కర్ స్కాం ముగింపు ఎలా ఉంటుందనేది ఉత్కంఠగా మారింది.

# ఢిల్లీలో రోజురోజుకూ క్షీణిస్తున్న గాలి నాణ్యత



న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయిలో నమోదవుతోంది. సోమవారం ఉదయం ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచిక 315గా నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. అశోక్ విహార్‌లో అత్యధికంగా ఏక్యూఐ 416గా నమోదైంది. ఆ తర్వాత గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. గణెళిశ్‌పూర్ వద్ద 318, జీటీబీ నగర్‌లో 302, కశ్మీర్ గేట్ ఐఎస్‌బీటీ ప్రాంతంలో 298, యమూర్ విహార్‌లో 287గా ఏక్యూఐ నమోదైంది. రాత్రికి ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఢిల్లీ ఆర్ఎమ్‌సీ అంచనా వేసింది. తీవ్రమైన వాయుకాలుష్యంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లోని ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. శ్వాసకోశ, ఛాతీలో నొప్పి, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలతో స్థానికులు ఆసుపత్రులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, ఒఖిఎ 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, ఒఖిఎ 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 29న ఢిల్లీలో మొదటిసారిగా కృత్రిమ వర్షాన్ని కురిపించేందుకు ఏర్పాట్లు చేశామని సీఎం రేఖా గుప్తా వెల్లడించారు.బురాయ్‌లో ప్రయోగాత్మక పరీక్ష విజయవం తమైందన్నారు. ఐఐటీ-కాన్పూర్ సహకారంతో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌కు ఐఎండీ, ఐఐటీఎమ్-పుణె తోడ్పాటును అందిస్తున్నాయి.దీపావళి త ర్వాత పొగ మంచు సీజన్‌లో కాలుష్య కణాలను తగ్గించడానికి వాయువ్య ఢిల్లీ లో అయిదు చోట్ల ఈ కృత్రిమ వర్షం కురిపించనున్నారు. ఇందుకోసం డీజీసీపీ అనుమతి పొందారు. సిల్వర్ అయోడైడ్ లేదా సోడియం క్లోరైడ్ లాంటి పదార్థాల ను మేఘాల్లోకి విడుదల చేయడం ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపిస్తారు. ఈ వ ర్షం కారణంగా రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది.

# సగం భారతంలో సర్...ఈసీ కీలక అడుగు



న్యూఢిల్లీ,సర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని దాదాపుగా సగం రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ని నిర్వహించేందుకు ముహూర్తం రెడీ చేసి ప్రకటించింది. ఇది దేశంలో రెండవ దశగా ఈసీ అంటోంది. తొలి దశ బీహార్ తో మొదలెట్టినట్లుగా చెబుతోంది. దేశంలో రెండవ దశలో 12 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్‌ను చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా వెల్లడించింది.

**సర్ సక్సెస్ :**

బీహార్ లో చేపట్టిన సర్ సూపర్ సక్సెస్ అయింది అని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంటున్నారు. తొలిదశలో బిహార్‌లో ఎస్ఐఆర్‌ను విజయవంతంగా పూర్తి చేసామని ప్రజలు అక్కడ పూర్తిగా సహకరించారని ఆయన అంటున్నారు. దాంతో తాజాగా రెండవ దశను చేపట్టాలని కీలక నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఇక ఈ రెండవ దశలో అండమాన్ నికోబార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్ లలో ఎస్ఐఆర్‌ను చేపడతామని అన్నారు. ఈసారి నిర్వహించే ఈ ప్రక్రియలో 51 కోట్లమంది ఓటర్లు భాగం కానున్నారు. ఇక నవంబర్ 4 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది, ఆదే విధంగా ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబర్ 9న ప్రకటిస్తారు తుది జాబితాను ఫిబ్రవరి 7న విడుదల చేస్తారు.

**ఇప్పటికి ఎనిమిది సార్లు :**

దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టడం గతంలో చాలా సార్లు జరిగింది అని ఈసీ అంటోంది. 1951 నుంచి ఈ సవరణను ఎనిమిది సార్లు నిర్వహించామని, 2002-2004లో చివరిసారి ఈ ప్రక్రియ జరిగిందని ఈసీ అంటోది. ఇదిలా ఉండగా ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితత్వాన్ని నిర్ధారించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ చెబుతున్నారు. దీని మీద ఎవరికీ ఎలాంటి అపోహలకు తావు లేదని ఈసీ చెబుతోంది. ఈ పన్నెండు రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో బూత్ లెవల్ అధికారులు ఇప్పటికే ఉన్న ఓటర్లకు ప్రత్యేకమైన గణన ఫారమ్‌లను పంపిణీ చేయడానికి ఈసీ రంగం సిద్ధం చేసింది. 2003 ఓటరు జాబితాలో పేర్లు ఉన్న ఓటర్లు అదనపు పత్రాలను అందించాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది.

**ఓట్ల చోరీ అంటూ :**

ఇదిలా ఉంటే బీహార్ లో సర్ ని అమలు చేస్తే ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున వ్యతిరేకించి. ఇపుడు రెండవ దశను ఈసీ ప్రకటించింది. దాంతో మరోసారి ఇది రాజకీయ రచ్చకు దారి తీస్తుందా అన్నది ఆలోచిస్తున్నారు. నిజానికి ఈసీ రాజ్యాంగబద్ధ సంస్థ. ఆ సంస్థ చేపట్టే ఏ చర్యలకు అయినా రాజకీయ పార్టీలు సహకారం అందించాలి. కానీ ఎందుకో ఈసీ మీదకే రాజకీయ పార్టీలు యుద్ధం ప్రకటిస్తున్నాయి. పైగా వచ్చే ఏడాది తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లలో ఎన్నికలు ఉన్నాయి. రెండవ దశ సర్ ప్రక్రియ అక్కడ కూడా జరుగుతోంది. మరి స్టాలిన్, మమతా బెనర్జీ ఏ విధంగా స్పందిస్తారు అన్నది చూడాల్సి ఉంది.

# దిగివస్తున్న బంగారం ధరలు..



హైదరాబాద్,ఊహించినట్టుగానే సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే బంగారం ధరలు మరింతగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లల్లో పసిడి ధరల తగ్గుదల, అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, డాలర్ బలపడుతుండటం వెరసి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో నేడు ట్రేడింగ్ మొదట్లో పసిడి ధరలు తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర గతంతో పోలిస్తే రూ. 1140 మేర తగ్గి రూ. 1,24,480కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1050 మేర తగ్గి రూ.1,14,100 వద్ద తచ్చాడుతోంది. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి అంతర్జాతీయ మార్కెట్‌లల్లో కూడా పసిడి ధరలు తిరోగమనంలో పయనిస్తున్నాయి. ఔన్స్ బంగారం (24 క్యారెట్) స్పాట్ ధర రూ.0.7 శాతం మేర క్షీణించి 4,082.77 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర కూడా 1 శాతం మేర తగ్గి 4,095.80 డాలర్ల వద్ద కొనసాగుతోంది. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి ధరలు మరింత తగ్గే ఛాన్సుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.అమెరికా, చైనా మధ్య సానుకూల వాతావరణంలో వాణిజ్య చర్చలు జరుగు తుండటంతో సురక్షిత పెట్టుబడి సాధనాలైన పసిడి, వెండికి డిమాండ్ తగ్గుతోందని నిపుణులు చెబుతున్నారు. ప్రామాణిక వడ్డీ రేట్ల కోత విషయంలో ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు తీసుకునే నిర్ణయం గురించి మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం కాస్త నెమ్మదించంతో కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్.. వడ్డీ రేట్లల్లో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశం ఉంది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ జపాన్ మాత్రం వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంది.

# కల్వకుంట్ల కవిత.. తెలంగాణ రాజకీయాల్లో ప్రభావం చూపేనా?



హైదరాబాద్,కల్వకుంట్ల కవిత జనం బాట పాదయాత్రను శనివారం (అక్టోబర్ 25) నిజామాబాద్ లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన జిల్లాలలో పర్యటించనున్నారు. సరిగ్గా ఐదేళ్ల కిందట తాను ఎక్కడ నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారో సరిగ్గా అదే నియోజకవర్గం నుంచి ఆమె తన కొత్త రాజకీయ బాట పట్టారు. ఈ సందర్భంగా ఆమె ఉద్వేగ భరితంగా చేసిన ప్రసంగంలో.. సొంత పార్టీయే తనను దగా చేసిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అంతర్గతంగా తనకు వ్యతిరేకంగా చేసిన కుట్రవల్లనే తాను నిజామాబాద్ లో పరాజయం పాలయ్యానన్నారు. జనం కాదు.. తనను సొంత పార్టీయే ఓడించిందని చెప్పుకున్నారు. తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పట్ల తనకు అపార గౌరవం ఉందని చెప్పిన కవిత.. ఆ కారణంగానే పార్టీలో తనకు ఎన్ని అవమానాలు జరిగినా నిశ్శబ్దంగా ఉన్నాననీ, అయితే ఇప్పుడు.. తనను పార్టీ నుంచి బయటకు పంపేశారనీ, అందుకే తిరిగి తన ప్రజల వద్దకు వచ్చానన్నారు. ఈ సందర్భంగా కవిత తన ప్రసంగంలో రేవంత్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించినప్పటికీ ప్రధానంగా ఆమె ప్రసంగం మొత్తం బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావు, సంతోష్ రావులే లక్ష్యంగా సాగింది. వారిరువురూ అవినీతికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. ఆ సందర్భంగా వారి అవినీతిని ప్రశ్నించిన కారణంగానే తనకు పార్టీలో అవమానాలు ఎదురయ్యాయని చెప్పుకున్నారు. చర్విత చరణమే అయినా కవిత.. తాను తెలంగాణ రాజకీయాలలో బలమైన శక్తిగా ఎదగాలని భావిస్తున్నట్లు చెప్పుకున్నారు.ఈ క్రమంలోనే ఆమె తాను కోత్త రాజకీయపార్టీని ఏర్పాటు చేయనున్నట్లు సంకేతాలిచ్చారు. తాను స్వతంత్రంగా, స్వంతంగా రాజకీయాలలో రాణించాలని భావిస్తున్నట్లు చెప్పిన కవిత, తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే సొంత పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అయితే ఒకే సమయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ లపై విమర్శలు గుప్పిస్తూ ఆమె ఎవరిని బెదరించాలని చూస్తున్నారో అవగతం కావడం లేదని పరిశీలకులు అంటున్నారు.కవిత తెలంగాణ రాజకీయాలలో బలీయమైన శక్తిగా ఎదుగుతారా? లేదా వేచి చూడాల్సిందేనంటున్నారు.

# వైకుంఠ ద్వారదర్శనం రెండురోజులకు కుదింపు ఎల్ల



తిరుపతి,తిరుమలలో వైకుంఠ ఏకాదశి దర్శనాన్ని రెండు రోజులకే పరిమితం చేస్తూ టీటీడీ తీసుకున్న నిర్ణయాన్ని మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తప్పుబట్టారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో వైకుంఠ ఏకాదశి దర్శనాన్ని 26 మంది పీఠాధిపతుల ఆగమ సలహాల మేరకు 10 రోజుల దర్శనం ఏర్పాటు చేస్తే ఇప్పుడు దాన్ని రెండు రోజులకే పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకోవడం సరైనది కాదన్నారు. ఆ రోజు పీఠాధిపతులు ఇచ్చిన సూచనలు ఇప్పుడు తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. మొత్తం 32 మంది ప్రముఖులతో చర్చించిన తర్వాతనే వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనం 10 రోజులపాటు ఉండే విధంగా ఏర్పాటు చేశామన్నారు. 2020లో జగన్ సీఎంగా ఉండగా పదిరోజులు పాటు వైకుంఠ ఏకాదశి పదిరోజులు దర్శనం అందుబాటులోకి తీసుకువచ్చాం అన్నారు. కృష్ణ మూర్తి వైద్యనాథన్ అప్పుడు బోర్డు సభ్యులు ఆనాడు ఉన్నారు, ఇప్పుడు కూడా ఉన్నారు. శృంగేరీ మఠం, ఆండవాన్ వన్ మఠం, త్రిదండి ,ఉత్తరాది, వ్యాసారాజ మఠం, పేజావర్ మఠం, అహోబిల మఠం పీఠాధిపతులు సూచనలు సలహాలు తీసుకునే ఈ నిర్ణయం ఆనాడు తీసుకున్నాం. ద్రావిడ సంప్రదాయం అంటూ కొత్తపల్లవి అందుకున్నారు. 12 మంది ఆళ్వారులు స్వామి వారిని కీర్తి, నారాయణ దివ్య ప్రబంధంగా ఇప్పటికీ నిరంతరం కొనసాగుతున్న పక్రియ. ద్రావిడ సంప్రదాయం కొనసాగించవద్దు అని వితండ వాదం చేస్తున్నారు ప్రస్తుత టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా గత ఏడాది 6మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు, మీ పరిపాలన లోపం వల్ల జరిగింది. తిరుమలలో 10 సార్లు, 12 సార్లు ఏడాదికి జరిగేవి, కాలానికి అనుగుణంగా పూర్వ కాలం నిర్ణయాల్లో మార్పులు వచ్చాయి. మీ నిర్ణయం వల్ల 10 లక్షల మందికి వైకుంఠ ఏకాదశి దర్శనం దూరం చేస్తున్నారు. మీ ఒత్తిడి వల్లే ఆగమ శాస్త్ర సలహాదారులు తలొగ్గారు, రెండు రోజులకు తగ్గించాలనే అలోచన మానుకోవాలి. స్థానికులకు దైవ దర్శనం దూరం చేయాలని చూస్తున్నారు, నాలుగేళ్లు పదిరోజులు పాటు వైకుంఠ ఏకాదశి ద్వారా దర్శనం లక్షలాది మందికి మేము సమర్ధవంతంగా నిర్వహించాము. శ్రీరంగం తరువాత తిరుమల లో పదిరోజులు పాటు వైకుంఠ ఏకాదశి దర్శనం అందుబాటులోకి తీసుకు వచ్చాం. ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు అప్పుడు ఉన్న ఈవోనే ఇప్పుడు ప్రస్తుతం ఉన్నారు. శ్రీరంగం ద్రావిడ సంస్కృతి అంటూ తెరపైకి తీసుకు వస్తున్నారు. రెండు రోజులకే కుదించాలని చేస్తున్న కుట్ర మానుకోవాలి. రెండు రోజుల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనం 110 కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసినట్లే' అని భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు.

# మద్దతు ధరలతో పంటల కొనుగోళ్లు



హైదరాబాద్,కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రైస్ సపోర్టు స్కీమ్ కింద పంటల కొనుగోలుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పెసర, మినుము పంటలను వందశాతం వరకు, సోయాబీన్‌ను 50శాతం వరకు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు మంత్రి తుమ్మల. మొక్కజొన్న, జొన్న పంటలను కూడా ప్రైస్ సపోర్టు స్కీమ్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాల కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. మరోవైపు... ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పౌరసరఫరాల శాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకి మంత్రి తుమ్మల పలు సూచనలు చేశారు. రోడ్లు, కొనుగోలు కేంద్రాల వద్ద నేలపై ధాన్యం ఉంచవద్దని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పత్తి అమ్మకాల విషయంలో రైతులు నాణ్యత, తేమ శాతం దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డుకు, జిన్నింగ్ మిల్లులకు తీసుకురావడానికి ముందు పత్తిలో తేమశాతం 12 శాతం మించకుండా చూసుకోవాలని మార్గనిర్దేశర చేశారు. 12 శాతం మించితే కనీస మద్దతు ధర పొందే అవకాశం ఉండదని చెప్పుకొచ్చారు. మార్కెట్ యార్డు, జిన్నింగ్ మిల్లులకు రాకముందే తేమ శాతం చెక్ చేసుకోవాలని సూచించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తేమశాతం ఎక్కువ ఉన్నా పత్తి పంట కొనాలని కేంద్ర ప్రభుత్వంపై

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com